మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 28-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 ‖ సంచిక: 29 Issue: 29

28 జూలై 2026 - మంగళవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - గ్రీష్మ ఋతువు ఆషాడ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:57 సూర్యాస్తమయం - సా. 6:47 తిథి చతుర్దశి సా. 6:17 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం భౌమ వాసరః నక్షత్రం పూర్వాషాఢ మ. 1:01 వరకు తరువాత ఉత్తరాషాఢ యోగం విష్కంభ రా. 11:31 వరకు కరణం వనిజ సా. 6:17 వరకు విష్టి ఉ. 7:14 వరకు వర్జ్యం రా. 10:00 నుండి రా. 11:46 వరకు దుర్ముహూర్తం ఉ. 8:31 నుండి ఉ. 9:23 వరకు రా. 11:15 నుండి రా. 12:00 వరకు రాహుకాలం మ. 3:34 నుండి సా. 5:11 వరకు యమగండం ఉ. 9:10 నుండి ఉ. 10:46 వరకు గుళికాకాలం మ. 12:22 నుండి మ. 1:58 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:21 నుండి తె. 5:09 వరకు అమృత ఘడియలు ఉ. 7:50 నుండి ఉ. 9:37 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:56 నుండి మ. 12:48 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial




## రెడ్ బుల్ ఎనర్జీ డ్రింక్ కాదు!

**ఫుడ్ సేఫ్టీ అథారిటీ స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: అధిక కెఫిన్ కలిగిన పానీయాలను ఎనర్జీ డ్రింక్స్‌గా ప్రచారం చేయవద్దని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ కీలక ఆదేశాలు జారీచేసింది. పెప్సీ, రెడ్ బుల్, మాన్‌స్టర్ బెవరేజ్, రిలయన్స్, హెల్ ఎనర్జీ వంటి ప్రముఖ కంపెనీలు తమ ఉత్పత్తుల లేబుళ్ల నుంచి 'ఎనర్జీ డ్రింక్' అనే పదాన్ని, దానికి సంబంధించిన వర్ణనలను 90 రోజుల్లోగా తొలగించాలని -2 వ పేజీలో...




## 4 గంటల్లో సిలిండర్ డెలివరీ

**ఇండియన్ ఆయిల్ సరికొత్త సేవ**

**ఇండేన్ ఎక్స్‌ట్రా లైట్‌నా పేరుతో 10 కిలోల సిలిండర్**

న్యూఢిల్లీ: ఎల్పీజీ వినియోగదారులకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కొత్త సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నా' పేరుతో తేలికైన 10 కిలోల కాంపోజిట్ గ్యాస్ సిలిండర్‌ను ప్రవేశపెట్టడంతోపాటు బుక్ చేసిన నాలుగు గంటల్లోనే ఇంటికే డెలివరీ చేసే సేవను ప్రారంభించింది. ప్రస్తుతం -2 వ పేజీలో...



## మతం మారితే 'ఎస్సీ' కోల్పోతారు!

**మరోసారి సుప్రీం కోర్టు స్పష్టీకరణ**

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తి ఇతర మతంలోకి మారితే వారి ఎస్సీ హోదా తక్షణమే రద్దవుతుందని దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మరోసారి స్పష్టంచేసింది. హిందూ, సిక్కు, బౌద్ధ మతాలను కాదని క్రిస్టియానిటీ లేదా ఇతర మతాలను స్వీకరించిన వ్యక్తులకు ఎస్సీ రిజర్వేషన్లు, కుల ధ్రువీకరణ పత్రాలు చెల్లవంటూ గతంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1950 నాటి తరువాయి 2 వ పేజీలో...


# హైడ్రా చీఫ్ అవుట్

**కమిషనర్ పోస్ట్ నుంచి రంగనాథ్‌ను తప్పించండి**

**సీఎస్‌కు హైకోర్టు ఆదేశాలు.. 63 కోర్టు ధిక్కరణలపై ఫైర్**

**ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సూచన**

**భేషరతు క్షమాపణలు తెలిపిన రంగనాథ్**




హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వ్యవహారశైలిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వరుసగా కోర్టు ధిక్కరణ పిటిషన్లు నమోదవుతున్న నేపథ్యంలో ఆయన్ను కమిషనర్ పదవి నుంచి తొలగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయన స్థానంలో ఐజీ స్థాయి అధికారిని నియమించాలని చీఫ్ సెక్రటరీకి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం సహించబోమని ధర్మాసనం స్పష్టం చేసింది.

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా లోతుకుంట పరిధిలోని సర్వే నంబర్ 1, 2లలో ఉన్న 40 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారం విచారణకు వచ్చిన సందర్భంగా రంగనాథ్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఆ భూమిలోకి హైడ్రా సిబ్బంది ప్రవేశించలేదని, ఎలాంటి కూల్చివేతలు చేపట్టలేదని అందులో పేర్కొన్నారు. వాస్తవాలను వక్రీకరించి పిటిషనర్ కోర్టును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. కోర్టులు, న్యాయవ్యవస్థపై తమకు అత్యున్నత గౌరవం ఉందని పేర్కొంటూ జరిగిన పరిణామాలకు భేషరతుగా క్షమాపణలు కోరారు. అయితే రంగనాథ్ వివరణతో సంతృప్తి చెందని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు తరువాయి 2 వ పేజీలో...



## మరో ఉద్యమం తప్పదు జాగ్రత్త!

**వెంటనే కేసులను ఉపసంహరించాలి**

**కేంద్రానికి సీజేపీ అల్టిమేటం**

న్యూఢిల్లీ: విద్యార్థులపై దాడులు చేసిన పోలీసులపై కేసులు పెడతామని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తెలిపింది. న్యూఢిల్లీలో ఆ పార్టీ ప్రతినిధులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆందోళన సమయంలో విద్యార్థులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. చర్చల సమయంలోనూ కేసులు ఎత్తేస్తామని కేంద్ర మంత్రి తరువాయి 2 వ పేజీలో...



## జంతర్ మంతర్ నిరసనల్లో 2,873 మంది నేరస్థులు

**ఫేషియల్ రికగ్నిషన్‌తో బట్టబయలు.. వీరిలో 989 మందిపై హత్య కేసులు**

**అల్లర్లు సృష్టించేందుకే పంపారా?.. ఆ కోణంలో పోలీసుల దర్యాప్తు**

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిర్వహించిన నిరసనలో భారీ సంఖ్యలో నేర చరిత్ర కలిగిన వ్యక్తులు ఉన్నట్టు ఢిల్లీ పోలీసులు గుర్తించారు. ఈ నెల 20 నుంచి 25 మధ్య జరిగిన ఈ ఆందోళనల్లో ఏకంగా 2,873 మంది నేర నేపథ్యం ఉన్న వ్యక్తులు పాల్గొన్నారని పోలీసు వర్గాలు సోమవారం వెల్లడించాయి.

న్యూఢిల్లీ: ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్), ఇతర సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో వీరిని గుర్తించినట్టు ఓ సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. పోలీసులు గుర్తించిన ఈ వ్యక్తులలో చాలా మందిపై హత్య, అత్యాచారం, పోక్సో చట్టం -2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,492 |
| వెండి (కిలో): | రూ.2,40,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,004 |

# కుటుంబానికి హాజరు!

**ప్రతి ఫ్యామిలీకి రిజిస్టర్ సర్టిఫికెట్**

**అప్లై చేసుకున్న రెండ్రోజుల్లో జారీ.. ప్రతి ప్రభుత్వ పథకానికి ధ్రువీకరణ**

**కొత్త రూల్‌కు సర్కారు అడుగులు.. రేషన్ కార్డుల డేటానే ప్రాతిపదిక**




తెలంగాణ రాష్ట్ర పౌరులకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో త్వరలోనే 'ఫ్యామిలీ రిజిస్టర్' (కుటుంబ రికార్డు) విధానాన్ని ప్రవేశపెట్టేందుకు సర్కార్ వేగంగా అడుగులు వేస్తోంది. పౌరులందరికీ ఒకే రకమైన ప్రామాణిక కుటుంబ రికార్డును అందించడమే లక్ష్యంగా ఈ సరికొత్త వ్యవస్థను రూపకల్పన చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రేషన్ కార్డుల డేటాను ప్రాతిపదికగా తీసుకుని ఈ ఫ్యామిలీ రిజిస్టర్‌ను ప్రభుత్వం సిద్ధం చేయనుంది.

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): రేషన్ కార్డు సంఖ్యనే కుటుంబ రిజిస్టర్ గుర్తింపు సంఖ్యగా పరిగణిస్తారు. దీని ద్వారా ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల వివరాలన్నింటినీ ఒకే రిజిస్టర్‌లో భద్రపరుస్తారు. దీనివల్ల వివిధ ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే సమయంలో కుటుంబ వివరాల ధ్రువీకరణ ప్రక్రియ చాలా సులభతరం కానుంది. ఇందులో కుటుంబ పెద్ద పేరు, సభ్యుల వివరాలు, వయసు, చిరునామా వంటి అంశాలు నమోదై ఉంటాయి. ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సేవలను ప్రజలకు మరింత దగ్గర చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజలు తరువాయి 2 వ పేజీలో...




## 4 రోజులు కుండపోత

**కొన్ని జిల్లాలకు రెడ్ అలర్ట్.. తెలంగాణకు భారీ వర్షసూచన**

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): తెలంగాణలో రానున్న నాలుగు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. వాయవ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. కొన్ని ప్రాంతాల్లో 100 నుంచి 120 మిల్లీమీటర్ల వరకు భారీ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా ఆదిలాబాద్, కొమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, తరువాయి 2 వ పేజీలో...

### విశ్వవాణి



నిద్ర సమస్యల నుంచి ఉపశమనం కోసం మెలటోనిన్ సప్లిమెంట్లను ఎక్కువకాలం వాడే వారికి గుండె సంబంధిత తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం పెరగవచ్చని తాజా అధ్యయనం సూచిస్తోంది. ఏడాది లేదా అంతకంటే ఎక్కువ కాలం మెలటోనిన్ తీసుకునే వారిలో గుండె వైఫల్యం (హార్ట్ ఫెయిల్యూర్), ఆస్పత్రిలో చేరే పరిస్థితులు, మరణ ప్రమాదం కూడా అధికంగా కనిపించినట్లు పరిశోధకులు వెల్లడించారు.



## ఎట్లైనా సరే.. మా పెద్దిని కాపాడండి

**యశోద దవాఖాన వైద్యులతో కేసీఆర్**

సికింద్రాబాద్, జూలై 27 (ఈవార్తలు): బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులను సికింద్రాబాద్‌లోని యశోద ఆస్పత్రిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా కేసీఆర్ యశోద ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబసభ్యులకు కేసీఆర్ మనోధైర్యాన్ని అందించారు. 'ఏం జేస్తరో చేయండి..మా పెద్దిని కాపాడండి..' అని కేసీఆర్ ఈ సందర్భంగా వైద్యులకు చేతులెత్తి తరువాయి 2 వ పేజీలో...



## హైదరాబాదీ షూటర్‌కు స్వర్ణం

**మనూభాకర్‌కు షాక్ ఇచ్చిన ఇషా సింగ్**

హంగ్జూ: ప్రతిష్ఠాత్మక ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత యువ షూటర్ ఇషా సింగ్ సంచలనం సృష్టించింది. హంగ్జూ వేదికగా జరుగుతున్న ఈ మెగా టోర్నీలో ఒలింపిక్ విజేత మనూ భాకర్ (Manu Bhaker)ను ఓడించి పసిడి పతకం కొల్లగొట్టిందీ హైదరాబాదీ. సోమవారం మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో మనూ కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచిన 21 ఏళ్ల ఇషా.. పోడియం మీద సగర్వంగా స్వర్ణ తరువాయి 2 వ పేజీలో...

## లోక్‌సభకు యాంటీ-పేపర్ లీక్ బిల్లు



**దోషులకు పదేళ్ల జైలు, రూ.10 కోట్ల జరిమానా**

న్యూఢిల్లీ: పేపర్ లీకులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం 2024 నాటి ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్ట సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ చట్టాన్ని సవరించేందుకు ఇటీవల ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ నేడు ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాల ఆందోళనల నడుమే ఈ బిల్లు సభ ముందుకు వచ్చింది. అనంతరం లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. ఈ బిల్లుపై సూచనలను మధ్యాహ్నం ఒంటిగంటల వరకు సమర్పించవచ్చని స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు తెలిపారు. అలా సవివర చర్చకు తగిన సమయం ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ బిల్లు ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమైందని, దీనిపై చర్చ నుంచి సభ దృష్టి మళ్లకుండా చూడాలని విపక్షాలకు సూచించారు. తరువాయి 2 వ పేజీలో...

ఈవార్తలు

మంగళవారం 28-7-2026, జగిత్యాల

## రాశి ఫలాలు

26.7.2026

**మేషం:** స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని అవరోధాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది. నిరుద్యోగుల శ్రమ వృధాగా మిగులుతుంది. ఆర్థికంగా ఆశించిన ఫలితాలు ఉండవు.

**వృషభం:** చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. స్థిరా స్తి వ్యవహారాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగస్తులకు జీతభత్యాల విషయంలో శుభవార్తలు అందుతాయి. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు.

**మిధునం:** ఉద్యోగాలలో మీ పనితీరుతో అందరిని ఆకట్టుకుంటారు. స్నేహితుల సహాయంతో ఋణ సమస్యలు నుండి బయటపడతారు. సోదరులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వృత్తి వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి.

**కర్కాటకం:** వృత్తి వ్యాపారాలు మరింత నిరుత్సాహ పరుస్తాయి. చేపట్టిన కార్యక్రమాలు మందకొడిగా సాగుతాయి. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు చెయ్యడం మంచిది కాదు. ఉద్యోగ వాతావరణం అంతగా అనుకూలించదు. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి.

**సింహం:** నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. సన్నిహితులతో మాటపట్టింపులు తప్పవు. వృధా ఖర్చుల విషయంలో పునరాలోచన చెయ్యాలి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆందోళన కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు పెరగటం వలన తగినంత విశ్రాంతి లభించదు. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య:** అనుకున్న పనులు అనుకున్న విధంగా పూర్తి చేస్తారు. సమాజంలో గౌరవ మర్యాదాలు పెరుగుతాయి. ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. వ్యాపారానికి నూతన పెట్టుబడులు అందుతాయి. వృత్తి ఉద్యోగాలలో పని ఒత్తిడి నుండి ఉపశమనం లభిస్తుంది. చాలాకాలంగా వేదిస్తున్న సమస్యలు నుండి బయటపడతారు.

**తుల:** నేత్ర అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. గృహమున కొందరి ప్రవర్తన మానసిక అశాంతి కలిగిస్తుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకోవడానికి మరింత కష్టపడాలి. ఉద్యోగ విషయాల్లో అధికారులతో జాగ్రత్తగా వ్యవహారించాలి.

**వృశ్చికం:** ఆదాయ మార్గాలు సంతృప్తి కలిగిస్తాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యుల సహకారంతో ముఖ్యమైన కార్యక్రమాలు పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగస్తులకు అదనపు బాధ్యతలు ఉన్నపటికీ సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

**ధనస్సు:** సోదరులతో స్థిరాస్తి వివాదాలు చికాకు పరుస్తాయి. వృత్తి వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది. నిరుద్యోగులకు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. వాహన ప్రయాణాలలో జాగ్రత్త వహించడం మంచిది.

**మకరం:** ముఖ్యమైన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు పుంజుకుని మరింత ముందుకు సాగుతాయి. ధన వ్యవహారాలు ఆశాజనకంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు అధికారుల అనుగ్రహంతో అనుకూల మార్పులు చోటుచేసుకుంటాయి.

**కుంభం:** నిరుద్యోగుల కలలు సాకరమౌతాయి. చిన్ననాటి మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. భూ క్రయ విక్రయాలు అనుకూలంగా సాగుతాయి. వ్యాపారాలలో మరింత ఉత్సాహంగా పని చేసి లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులు అప్రయత్నంగా పూర్తవుతాయి.

**మీనం:** ముఖ్యమైన వ్యవహారాలు వాయిదా వెయ్యడం మంచిది .బంధు మిత్రులుతో అకారణ వివాదాలు కలుగుతాయి .నూతన వ్యాపారాలకు పెట్టుబడులు పెట్టె విషయంలో పునరాలోచన చెయ్యడం మంచిది ఉద్యోగస్తులకు సహోద్యోగులతో మాటపట్టింపులు ఉంటాయి వృధా ఖర్చులు పెరుగుతాయి.

# హైడ్రా చీఫ్ అవుట్

మొదటి పేజీ తరువాయి

చేసింది. రంగనాథ్‌పై ఇప్పటికే దాదాపు 63 కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలయ్యాయని గుర్తు చేసింది. ఒకే అధికారిపై ఇన్ని కోర్టు ధిక్కరణ కేసులు ఎందుకు నమోదవుతున్నాయని ప్రశ్నించింది. కోర్టు మధ్యంతర ఉత్తర్వులను పాటించకుండా వ్యవహరించడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందా అని ప్రభుత్వ న్యాయవాదిని నిలదీసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే తీరును ఉపేక్షించలేమని స్పష్టం చేసింది.

రూ.లక్షల కోట్ల ప్రభుత్వ ఆస్తులు కాపాడినా!: రంగనాథ్

హైడ్రా కమిషనర్ పదవి నుంచి తనను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలపై ఐపీఎస్ ఏవీ రంగనాథ్ స్పందించారు. రాజ్యాంగ స్ఫూర్తితో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, పార్కులను కాపాడటమే లక్ష్యంగా తాను పనిచేశానని ఆయన తెలిపారు. గత రెండేళ్లలో హైడ్రా ద్వారా సుమారు రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కబ్జాదారుల చెర నుంచి విడిపించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూమాఫియా, పలుకుబడి కలిగిన కబ్జాదారులే న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇప్పటివరకు ఆరు చెరువులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించామని, మరో 20 చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. బడా బాబులు ఆక్రమణలో ఉన్న వందలాది చెరువులు, పార్కులు, వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను గత రెండేళ్లలో హైడ్రా స్వాధీనం చేసుకుని ప్రభుత్వానికి అప్పగించిందని పేర్కొన్నారు. ల్యాండ్ మాఫియా, భూకబ్జాదారులు తప్పుడు సమాచారంతో కోర్టులను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. లోతుకుంట భూముల విషయంలో ఒక రియల్ ఎస్టేట్ సంస్థ సుమారు రూ. 10,000 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించిందని, రూ. 2,500 కోట్ల విలువైన వారసత్వ శిలలను (హెరిటేజ్ రాక్ ఫార్మేషన్స్) ధ్వంసం చేసిందని రంగనాథ్ వివరించారు. పర్యావరణవేత్తలు, స్థానికుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకే తాము చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. తనపై ఉన్న 63 కేసులు కూడా ఇటువంటి కబ్జాదారులు పెట్టినవేనని, వాటిని న్యాయపరంగానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు. సేవ్ ది రాక్ సొసైటీ, పర్యావరణవేత్తలతో పాటు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగానే హైడ్రా రంగంలోకి దిగిందని రంగనాథ్ స్పష్టం చేశారు. ఎక్కడో మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న భూమిని చూపిస్తూ, 120 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించిన సదరు బిల్డర్, తనపై కోర్టు ధిక్కరణ కేసు వేశారని వెల్లడించారు. బతుకమ్మ కుంట చెరువును కబ్జా చేయాలని చూసిన వారు, లోతుకుంటలో వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని ఆశించిన వారు, సామాన్యుల ప్లాట్లను ఆక్రమించి భారీ కాంప్లెక్స్‌లు నిర్మించాలని చూస్తున్న సంధ్యా శ్రీధర్ రావు, వేల మంది సింగరేణి కార్మికుల ప్లాట్స్‌లను కాజేయాలని చూసిన నల్ల మల్లారెడ్డి, క్రిమినల్ మాఫియాగా చెలామణి అవుతూ పరభుత్వ భూములను, సామాన్యుల ప్లాట్లను ఆక్రమించిన ముఖీం, వీరందరికీ హైడ్రా కమిషనర్‌గా తాను అడ్డుపడటమే చేసిన తప్పని ఆవేదన వ్యక్తం చేశారు. వీరందరూ కలిసి తనపై 63 కోర్టు ధిక్కారణ కేసులు వేశారని, వీటిని ఎదుర్కోవడానికి తానేమీ వెనుకంజ వేయడంలేదని స్పష్టం చేశారు. న్యాయస్థానాలపై తనకు పూర్తి విశ్వాసం ఉందని, చట్టం పట్ల గౌరవంతోనే విధులు నిర్వహిస్తున్నానని తేల్చి చెప్పారు.

## హైదరాబాదీ షూటర్‌కు స్వర్ణం

మొదటి పేజీ తరువాయి

పతకం స్వీకరించింది. మెగా ఈవెంట్లో నిరాశపరిచిన మనూ భాకర్ కాంస్యంతో సరిపెట్టుకుంది. షూటింగ్‌లో గొప్పగా రాణిస్తున్న ఇషా సింగ్ అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా చాటింది. ఇటీవలే మ్యూనిచ్‌లో అదిరే ప్రదర్శనతో రికార్డు పుస్తకాల్లో చేరిన ఇషా ఈసారి చైనాలోని హంగ్జౌ వేదికగా జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో పసిడి వెలుగులు విరజిమ్మింది. మహిళల25 మీటర్ల పిస్టల్ విభాగంలో భారత్‌కే చెందిన ఒలింపిక్ విజేత మనూ భాకర్‌ను ఓడించి పసిడి పతకం గెలచుకుంది ఇషా. 'మ్యూనిచ్‌లో పతకం గెలిచినందున ఈ మ్యాచ్‌లో నాపై ఒత్తిడి ఎక్కువ ఉంది. ఇలాంటి సమయంలో మనలోని అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాల్సి వస్తుంది. ఇక్కడే రెండేళ్ల క్రితం ఆసియా క్రీడల్లో పాల్గొన్న అనుభవం.. నాలుగు మెడల్స్ సాధించిన జ్ఞాపకాలు నాకు మరింత బలమయ్యాయి' అని ఇషా పేర్కొంది. త్వరలో జరుగనున్న వరల్డ్ ఛాంపియన్‌షిప్స్, ఆసియా క్రీడలకు ముందు గోల్డ్ మెడల్ సాధించడం ఇషా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయనుంది.

## జంతర్ మంతర్ నిరసనల్లో 2,873 మంది నేరస్థులు

మొదటి పేజీ తరువాయి

కింద కేసులు, కిడ్నాప్, దోపిడీ వంటి తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. వీరిలో కనీసం 989 మంది అత్యంత తీవ్రమైన నేరాలకు పాల్పడినట్టుగా పోలీసులు అనుమానిస్తున్నారు. వీరిలో కొందరు పదేపదే నిరసన ప్రదేశానికి వచ్చి వెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. విద్యార్థుల ముసుగులో సంఘ విద్రోహ శక్తులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడకుండా నిరోధించేందుకే జంతర్ మంతర్ వద్ద నిఘా పెంచినట్టు అధికారి వివరించారు. నిరసన ప్రదేశం ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లతో పాటు, నగరంలోని కీలక ప్రాంతాలు, సరిహద్దు ప్రవేశ మార్గాల వద్ద పోలీసులు హై-రిజల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ ఎఫ్ఆర్ఎస్ కెమెరాలు తీసిన చిత్రాలను, వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన నేరస్థులు, పరారీలో ఉన్నవారు, హిస్టరీ-షీటర్ల వివరాలున్న డేటాబ్యాంక్‌తో పోల్చి చూశారు. ఈ ప్రక్రియలోనే ఇంత పెద్ద సంఖ్యలో నేరస్థులు ఆందోళనల్లో పాల్గొన్నట్టు బట్టబయలైంది. గుర్తించిన వారిలో ఎక్కువ మంది ఈశాన్య ఢిల్లీలోని సీలంపూర్, చాంద్ బాగ్, జాఫ్రాబాద్‌తో పాటు ఆగ్నేయ ఢిల్లీలోని జామియా నగర్, షాహీన్ బాగ్, ఓఖ్లా ప్రాంతాలకు చెందినవారని తేలింది. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకే వీరిని ఉద్దేశపూర్వకంగా నిరసన ప్రదేశానికి పంపారా? లేదా పాకిస్థాన్ నుంచి పనిచేసే సోషల్ మీడియా హ్యాండిల్స్ వీరిని ప్రభావితం చేస్తూ భద్రతా బలగాల గురించి తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నాయా? అనే కోణంలో పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 20న జంతర్ మంతర్, ఇతర ప్రాంతాలలో జరిగిన హింసాత్మక ఘటనలలో వీరి ప్రమేయం ఉందా అనే దానిపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

## ఎట్టైనా సరే.. మా పెద్దిని కాపాడండి

మొదటి పేజీ తరువాయి

నమస్కరించారు. దేవుడున్నాడు, డాక్టర్లున్నారు.. అన్నీ సవ్యంగానే జరుగుతాయి.. గుండె చెదురొద్దు ధైర్యంగా ఉండండని పెద్ది భార్యా పిల్లలు, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పెద్ది సుదర్శన్ రెడ్డికి చికిత్స అందుతున్న ఐసీయూ వార్డుకు చేరుకొని, డాక్టర్లతో కలిసి అక్కడ పెద్దికి అందుతున్న చికిత్స విధానాన్ని పరిశీలించారు. దాదాపు అరగంట సేపు అక్కడే నిలుచుని డాక్టర్లతో చికిత్స అందుతున్న తీరును గురించి క్షుణ్ణంగా ఆరా తీశారు. కాగా పెద్ది సుదర్శన్ రెడ్డికి ప్రపంచ స్థాయి అత్యున్నత చికిత్సను అందిస్తున్నామని, అవసరమైన మేరకు విదేశాల నుంచి కూడా డాక్టర్లతో కన్సల్టెన్సీ తీసుకుంటున్నామని డాక్టర్లు తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు సహా అన్ని అవయవాలు పని చేస్తున్నాయని.. బ్రెయిన్ ఇంకా పునరుత్తేజం చెందాల్సి ఉన్నదని, అందుకు మరో 48 గంటలు సమయం పట్టే అవకాశం ఉన్నదని డాక్టర్లు వివరించారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రులు హరీశ్ రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజయ్య, వేముల ప్రశాంత్ రెడ్డి, సత్యవత్, పద్మారావు గౌడ్, వినోద్ కుమార్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సంజయ్, పార్టీ నాయకులు గ్యాదరి బాలమల్లు, సతీశ్ రెడ్డి, రజినీ సాయిచంద్, పల్లె రవికుమార్, రాజాం యాదవ్, వాసుదేవరెడ్డి, గజ్జెల నగేశ్, చిరుమల్ల రాకేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## లోక్‌సభకు యాంటీ-పేపర్ లీక్ బిల్లు

మొదటి పేజీ తరువాయి

మరోవైపు, ఈ బిల్లుపై ప్రతిపక్షాలు విమర్శలు వ్యక్తం చేస్తున్నాయి. ఇదంతా పైపై మెరుగు అని మండిపడ్డాయి. అదే సమయంలో ధర్మేంద్ర ప్రధాన్‌కు పార్లమెంట్‌లో ఘన స్వాగతం పలకడాన్ని తప్పుపట్టాయి. జూలై 20న 'చలో సంసద్' పేరిట చేపట్టిన నిరసనల్లో విద్యార్థులపై లాఠీఛార్జి చేయడాన్ని ఖండించాయి. దానిపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని విపక్ష నేతలు డిమాండ్ చేశారు. నీట్ సహా పలు పరీక్షల పేపర్‌లు లీక్ కావడంతో దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతోన్న సంగతి తెలిసిందే. దాంతో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలోనే కేంద్రం తాజా బిల్లును తీసుకొచ్చింది. ప్రశ్నపత్రాల లీకేజీకి పాల్పడిన వ్యక్తిగత కేసుల్లో దోషులకు ఇప్పటివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానాను విధిస్తున్నారు.

## మరో ఉద్యమం తప్పదు జాగ్రత్త!

మొదటి పేజీ తరువాయి

జేపీ నడ్డా తమకు తెలిపారని చెప్పారు. ఒప్పందం అమలు చేయకపోతే మళ్లీ ఆందోళనకు దిగుతామని కేంద్రానికి సీజేపీ వార్నింగ్ ఇచ్చింది. ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం ఉల్లంఘించిందని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ సోమవారం కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌కు ఉద్దేశించి ఎక్స్‌లో కూడా సీజేపీ ప్రతినిధి ఆశుతోష్ రాంకా ఓ పోస్ట్ చేశారు. బిహార్, పశ్చిమ బెంగాల్‌లో విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లో పోలీసులు దాడులు చేయడాన్ని ప్రస్తావించారు. "జేపీ నడ్డా, జితేంద్ర సింగ్.. ఆందోళనకారులపై పోలీసు చర్యలు ఉండవని జరిగిన ఒప్పందాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నారని మేము గమనిస్తున్నాం. బిహార్, బెంగాల్‌లో వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేశారు. ఢిల్లీతో పాటు ఇతర రాష్ట్రాల్లో వందలాది మందిపై నిఘా పెట్టి వేధిస్తున్నారు.

# 4 రోజులు కుండపోత

మొదటి పేజీ తరువాయి

ములుగు, హన్మకొండ, వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ఈనెల 30వ తేదీ వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, సిద్ధిపేట, జనగామ, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, నారాయణపేట, మహబూబ్ నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందగా.. యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌లో రానున్న 3 రోజుల పాటు ఆకాశం మేఘావృతమై ఉండనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. మరీ ముఖ్యంగా సాయంత్రం, రాత్రి వేళల్లో ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండటంతో వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. హైదరాబాద్‌లో రెండో రోజూ భారీ వర్షం పడుతోంది. సోమవారం రాత్రి పది గంటల తర్వాత వాన అందుకోవడంతో పలు ప్రాంతాల్లోని రోడ్లు, కాలనీలు జలమయ్యాయి. బోరబండ, బంజారాహి ల్స్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, పంజాగుట్ట, ఫిలింనగర్, ఎస్ఆర్ నగర్‌లో వాన దంచికొట్టింది. సాయంత్రం నుంచే ఆకాశం మేఘావృతమై.. నల్లని మబ్బులు కమ్ముకోగా.. రాత్రి వాన మొదలైంది. బంజారాహిల్స్, పంజాగుట్ట, అమిర్‌పేట, ఎర్రగడ్డ, జూబ్లీహిల్స్, రహమత్ నగర్, యూసుఫ్‌గూడ, కృష్ణానగర్, బేగంపేట.. తదితర ప్రాంతాల్లో వర్షం కుమ్మరించింది. ఈ నేపథ్యంలో సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు .. కీలక ట్రాఫిక్ అడ్వైజరీ జారీ చేశారు. వర్షాల కారణంగా ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో సాయంత్రం పీక్ అవర్స్‌లో తీవ్ర ట్రాఫిక్ రద్దీ ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. దీంతో ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నిర్వహణ దృష్ట్యా ఐటీ కంపెనీలు, ఇతర సంస్థలు తమ ఉద్యోగులకు దశల వారీగా ముందస్తు లాగౌట్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గచ్చిబౌలి, మాదాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో ఒకేసారి ఉద్యోగులు రోడ్లపైకి వస్తే ట్రాఫిక్ స్తంభించే పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.

# రెడ్ బుల్ ఎనర్జీ డ్రింక్ కాదు!

మొదటి పేజీ తరువాయి

తన ఆదేశాల్లో పేర్కొన్నది. భారత్‌లో 'ఎనర్జీ డ్రింక్స్' పేరిట విక్రయిస్తున్న ఉత్పత్తులకు సంబంధించి ఎటువంటి అధికారిక ప్రమాణాలు లేవని పేర్కొన్నది. 'శరీరానికి, మనసుకు ఉత్తేజాన్ని ఇస్తుంది' లేదా 'శారీరక బలహీనతను తగ్గిస్తుంది' వంటి ప్రకటనలు వినియోగదారులను తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని ఈ సందర్భంగా అభిప్రాయపడింది. బ్రాండింగ్ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్న ఆరోపణలతో గతంలోనే రెడ్ బుల్, పెప్సీకోకు చెందిన స్టింగ్, రిలయన్స్ క్యాంపా ఎనర్జీ వంటి బ్రాండ్‌లకు సంస్థ నోటీసులు జారీచేసింది. ఇటీవల పరిశ్రమ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవో రజిత్ పున్హానీ ఈ అంశంపై స్పష్టతనిచ్చారు. ఈ క్రమంలో నిబంధనలకు కట్టుబడి ఉంటామని కంపెనీలు అంగీకరించడంతో, లేబుళ్ల మార్పునకు సంబంధించి ప్రభుత్వం 90 రోజుల గడువు ఇచ్చింది. దేశీయంగా ఎనర్జీ డ్రింక్స్ మార్కెట్ వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా 2017లో పెప్సీ కంపెనీ తక్కువ ధరకే 'స్టింగ్' బ్రాండ్‌ను పరిచయం చేయడంతో యువతలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ వీటికి ఆదరణ గణనీయంగా పెరిగింది.

# 4 గంటల్లో సిలిండర్ డెలివరీ

మొదటి పేజీ తరువాయి

ఈ సేవను ఎంపిక చేసిన నాలుగు నగరాల్లో ప్రారంభించినట్లు సంస్థ ప్రకటించింది. సంప్రదాయ ఉక్కు సిలిండర్లతో పోలిస్తే కొత్త 10 కిలోల కాంపోజిట్ సిలిండర్ బరువు తక్కువగా ఉంటుంది. దాంతో దాన్ని మోయడం, తరలించడం, వినియోగించడం మరింత సులభమవుతుందని ఇండియన్ ఆయిల్ తెలిపింది. గృహ వినియోగంతోపాటు చిన్న వ్యాపార అవసరాలకు కూడా ఇది అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే సిలిండర్‌ను ఇంటికే అందించేలా కొత్త సేవను రూపొందించింది. ఈ సేవలో వినియోగదారులకు మరికొన్ని సౌకర్యాలు కూడా కల్పించారు. తమకు అనుకూలమైన డెలివరీ సమయాన్ని ఎంచుకునే అవకాశం కల్పించారు. డిజిటల్ విధానంలో సులభంగా బుక్ చేసుకునే సదుపాయం కూడా అందుబాటులో ఉంటుంది. దాంతో గ్యాస్ బుకింగ్ ప్రక్రియ మరింత పారదర్శకంగా, వేగంగా మారుతుందని సంస్థ తెలిపింది. ప్రస్తుతం పుణే, గురుగ్రామ్, ఇండోర్, కోయంబత్తూరు నగరాల్లో ఈ కొత్త సేవ అందుబాటులో ఉంది. వినియోగదారుల స్పందనను బట్టి త్వరలో మరిన్ని నగరాలకు విస్తరించనున్నట్లు ఇండియన్ ఆయిల్ వెల్లడించింది. అలాగే 5 కిలోల ఇండేన్ చోటూ సిలిండర్‌కు కూడా నాలుగు గంటల్లో డెలివరీ సేవను విస్తరించింది. చిన్న కుటుంబాలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు ఎక్కువగా వినియోగించే ఈ సిలిండర్‌ను కూడా త్వరగా అందించేలా చర్యలు తీసుకుంది.

# మతం మారితే 'ఎస్సీ' కోల్పోతారు!

మొదటి పేజీ తరువాయి

రాజ్యాంగ ఉత్తర్వుల ప్రకారం.. హిందూ, సిక్కు, బౌద్ధ మతస్థులు మాత్రమే ఎస్సీ హోదాకు అర్హులని, మతం మారిన మరుక్షణమే ఎస్సీ హోదా, దాని ఆధారిత ప్రయోజనాలు ముగుస్తాయని స్పష్టంచేసింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో ఎలాంటి పొరపాటు లేదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. పునఃపరిశీలన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఒకవేళ ఎవరైనా తిరిగి ఎస్సీ హోదాను పొందాలంటే రాజ్యాంగం నిర్దేశించిన మూడు ప్రధాన నిబంధనలకు (పుట్టుకతో ఎస్సీ అయి ఉండటం, స్వచ్ఛందంగా తిరిగి సొంత మతంలోకి రావడం, మూల కుల సమాజం వారిని ఆమోదించడం) కట్టుబడి ఉండాలని ధర్మాసనం పేర్కొన్నది.

# కుటుంబానికి హాజరు!

మొదటి పేజీ తరువాయి

తమకు సమీపంలోని మీసేవా కేంద్రాల ద్వారా లేదా ఆన్‌లైన్ పోర్టల్స్ ద్వారా ఈ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న రెండు పని దినాల్లోనే ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్‌ను జారీ చేసేలా అధికారులు ప్రత్యేక వ్యవస్థను తీసుకురానున్నారు. ప్రస్తుతం వేర్వేరు ప్రభుత్వ పథకాలకు వేర్వేరు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త విధానం అందుబాటులోకి వస్తే.. అన్ని రకాల ప్రభుత్వ సేవలకు, సంక్షేమ పథకాల లబ్ధికి ఈ 'ఒకే కుటుంబ రికార్డు' ప్రామాణికంగా మారుతుంది. దీనివల్ల ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తప్పుతాయని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలోనే ఈ ఫ్యామిలీ రిజిస్టర్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా ప్రారంభించనున్నారు. అయితే, ఈ సర్టిఫికెట్ కేవలం కుటుంబ సభ్యుల వివరాలు ధ్రువీకరణకు మాత్రమేనని, దీని ద్వారా ఆస్తి హక్కులు, చట్టపరమైన వారసత్వం లేదా ప్రభుత్వ పథకాలకు నేరుగా అర్హత లభించదని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఈ నెల 25వ తేదీనే రెవెన్యూ శాఖ జీవో ఎంఎస్ నంబర్ 172 ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ జీవో కాపీని ప్రభుత్వ వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు.




# ఆగస్ట్ 1న భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభం

## ఏర్పాట్లపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు

భోగాపురం, జూలై 27 (ఈవార్తలు): భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌గా నామకరణం చేసిన ఈ విమానాశ్రయాన్ని ఆగస్ట్ 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఉత్తరాంధ్ర ప్రగతిలో ఈ విమానాశ్రయం ఒక కీలక మైలురాయిగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నిర్మించిన ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ప్రారంభంతో రాష్ట్ర విమానయాన రంగంలో ఒక నూతన శకం మొదలవుతుందని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక వసతులతో రూపుదిద్దుకున్న ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యాలను మెరుగుపరచడమే కాకుండా, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలను గణనీయంగా పెంచుతుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అదే సమయంలో పర్యాటకం, వాణిజ్య కార్యకలాపాలకు కూడా ఇది భారీ ఊతాన్ని ఇస్తుందని వివరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేయనున్న ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేలా ఏర్పాట్లు ఉండాలని సీఎం సూచించారు. గిరిజన సంప్రదాయ నృత్యమైన థింసాతో పాటు, కూచిపూడి నృత్య ప్రదర్శనలతో స్వాగత కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. 13 వేల మందితో నిర్వహించే థింసా నృత్యం గిన్నిస్ రికార్డు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. 11 అంతర్జాతీయ, 25 జాతీయ చానళ్లలో ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అరకు కాఫీతో సహా స్థానిక ఉత్పత్తులు, పర్యాటక ప్రదేశాలకు విస్తృత ప్రచారం కల్పించి, బ్రాండింగ్ చేయాలని కూడా ఆయన ఆదేశించారు.








## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811
నంబర్‌ను సంప్రదించవచ్చు.

## వెల్గటూర్‌లో 'నేను సైతం'తో సీసీ కెమెరాల ఏర్పాటు

వెల్గటూర్, జూలై 27 (ఈవార్తలు): వెల్గటూర్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న 'నేను సైతం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని బాలాజీ కిరాణా స్టోర్ ఎదుట రెండు నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాలు, డీఎస్పీ కె. పురుషోత్తంరెడ్డి సూచనలు, ధర్మపురి సీఐ ఎ. రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాల యజమానులు తమ ప్రాంగణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీంతో నేరాల నివారణతో పాటు నిందితులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవడం సులభమవుతుందని తెలిపారు.

## జైలు బయట విచారణ

**కస్టోడియల్ కేసులో సుప్రీం కీలక ఆదేశాలు**

రాజమండ్రి, జూలై 27 (ఈవార్తలు): కృష్ణలంక యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు కస్టడీ విచారణపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. నిందితుడిని రాజమండ్రి జైలులోనే విచారించాలంటూ గతంలో ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దర్యాప్తునకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. విచారణ కోసం సీఐ నాగరాజును విజయవాడలోని దర్యాప్తు కేంద్రానికి గానీ, ఇతర సురక్షిత ప్రాంతాలకు గానీ తీసుకెళ్లి ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు విచారణ ప్రక్రియలో కీలక వెసులుబాటు లభించినట్లయింది. అయితే, కస్టడీ విచారణ సమయంలో నిందితుడిపై ఎలాంటి భౌతిక దాడి లేదా హింసకు పాల్పడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అంతేకాకుండా, విచారణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో సీఐ నాగరాజు కస్టడీ విచారణపై కొనసాగుతున్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

## రేవంత్ వైఫల్యాల దృష్టి మరల్చేందుకే 21

**తెలంగాణ బీజేపీ చీఫ్ తీవ్ర ఆగ్రహం**

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): చట్టసభలకు పోటీ చేసే కనీస వయసును 25 నుంచి 21 ఏళ్లకు తగ్గించాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపాదనను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు కొట్టిపారేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే సీఎం ఈ కొత్త అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆయన ఆరోపించారు. ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైన ప్రభుత్వాన్ని జెన్-జీ యువత ప్రశ్నిస్తారనే భయంతోనే రేవంత్ రెడ్డి ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారని అన్నారు. చట్టసభల సభ్యులకు తగిన అనుభవం అవసరమని భావించే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వంటి రాజ్యాంగ నిర్మాతలు ఈ వయసును 25 ఏళ్లుగా నిర్ధారించారని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా యువతపై చిత్తశుద్ధి ఉంటే, పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను తొలగించి ఒక యువ నేతకు బాధ్యతలు అప్పగించాలని రాంచందర్ రావు సవాల్ విసిరారు. తమ పార్టీ మాత్రం నితిన్ నబీన్‌ను జాతీయ అధ్యక్షుడిగా నియమించి యువతకు నిజమైన ప్రాధాన్యత ఇచ్చిందని ఆయన పోల్చి చెప్పారు. దేశంలోని యువత బీజేపీపైనే విశ్వాసం ఉంచిందని, అందుకే తమ పార్టీ అతిపెద్ద రాజకీయ శక్తిగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జెన్-జీ ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, 21 ఏళ్లకే ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా, స్థానిక సంస్థల ప్రతినిధులుగా పోటీ చేయగలిగినప్పుడు, ఎమ్మెల్యే, ఎంపీలుగా ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. ఈ అంశంపై ఆగస్టు మొదటి వారంలో శాసనసభ, మండలి ప్రత్యేక సమావేశాలు నిర్వహించి తీర్మానం చేస్తామని, దాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి పంపుతామని ప్రకటించారు.

## అదిగో.. రిజర్వేషన్ హటావో మూవ్‌మెంట్

**మొదలైన మరో డిజిటల్ ఉద్యమం.. నిమిషాల్లో లక్షల మంది ఫాలోవర్లు**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్‌పై కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన సక్సెస్ కావడంతో దేశంలో ఇదే తరహాలో మరికొన్ని పోరాటాలు పురుడు పోసుకుంటున్నాయి. ప్రస్తుతం సోషల్ మీడియా వేదికగా మరొక భారీ డిజిటల్ ఉద్యమం మొదలైంది. దేశంలో ప్రస్తుతం అమలవుతున్న రిజర్వేషన్ల విధానంలో సమూల మార్పులు తీసుకురావాలని, దేశంలో కులం ప్రస్తావన లేకుండా సరికొత్త చట్టాన్ని తీసుకురావాలన్న ప్రధాన డిమాండ్□తో 'రిజర్వేషన్ హటావో మూవ్ మెంట్' ప్రారంభమైంది. విద్య, ఉద్యోగ అవకాశాలలో ప్రతిభకు ప్రాధాన్యం ఇస్తూ అందరికీ సమాన ప్రాతిపదికన ఫలాలు అందేలా చట్ట సవరణలు చేయాలని ఆర్□హెచ్ఏ డిమాండ్ చేస్తోంది. ఈ ఉద్యమంపై ఆర్ హెచ్ఏ ప్రతినిధులు స్పందిస్తూ తమ ఉద్యమానికి ఏ రాజకీయ పార్టీతోనూ ఎలాంటి సంబంధం లేదని ఇది ఏ రకమైన రాజకీయ ప్రాతిపదికన నడిచే ప్రచారం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాల్లో ఎక్కడా 'కులం' ప్రస్తావన లేకుండా సరికొత్త చట్టాన్ని తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యం పేర్కొన్నారు. కుల వివక్షను నిర్మూలించడం తమ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వాలు చెబుతున్నాయని ఇదే నిజమైతే ప్రజల రోజువారీ జీవితంలో కుల గుర్తింపును అడగడం లేదా గుర్తించడం ప్రభుత్వం నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. అగ్రవర్ణాలతో పాటు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలంతా తమ కులాన్ని ప్రదర్శించడం చట్టవిరుద్ధం చేయాలని డిమాండ్ చేశారు. సాధారణ ప్రభుత్వం, విద్యాసంస్థల ప్రవేశాలు, ఉద్యోగ దరఖాస్తులు, ఇతర ప్రజా సంబంధిత ప్రక్రియల్లో ఏ పౌరుడూ తన కులాన్ని వెల్లడించాల్సిన లేదా నమోదు చేయాల్సిన అవసరం ఉండకూడదని, ఇందుకోసం కులం, రిజర్వేషన్లు తొలగించాలని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. అజిత్ అనే వ్యక్తి ఆర్□హెచ్ఏ పేరుతో ఇన్ స్టా గ్రామ్ ఖాతాను ప్రారంభించగా అతి తక్కువ కాలంలోనే లక్షల్లో ఫాలోవర్స్ పెరగడం ఇప్పుడు దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం ఈ ఖాతాకు 4.2 మిలియన్ ఫాలోవర్స్ రావడం ఇదంతా కేవలం గంటల వ్యవధిలోనే జరిగిపోవడం దేశవ్యాప్తంగా రిజర్వేషన్ల విధానంపై సరికొత్త చర్చ ప్రారంభానికి దారి తీసింది. అనేక మంది నెటిజన్లు ఈ ఉద్యమానికి మద్దతుగా పోస్టులు చేస్తున్నారు. మద్దతు తెలపాలంటూ కామెంట్స్ చేస్తున్నారు. దీంతో పూట పూటకు మద్దతు పెరుగుతున్న ఈ మూవ్□మెంట్ ఇప్పుడు దేశంలో మరో సంచలనంగా మారపోతోందా అనే చర్చ మొదలైంది. అయితే చిన్న ఆలోచనతో మొదలైన సీజేపీ దేశ రాజకీయాల్లో సంచలనంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు ఈ ఆర్ఎహ్ఏ మూవ్ మెంట్ దేశ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణం కాబోతోంది ఆసక్తి రేపుతోంది. విభిన్న కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు, జాతుల సమాహారంతో కూడిన మన దేశంలో కుల ఆధారిత రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. దీంతో కులం లేకపోతే రిజర్వ్యషన్లు ఎక్కడివి అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఇదిలా ఉంటే దేశ రాజకీయాల్లో రిజర్వేషన్లు పొలిటికల్ సెంటిమెంట్□గా మారింది. రిజర్వేషన్ల అంశంతో పెట్టుకుంటే తమ అస్థిత్వానికే ప్రమాదం అనే భయం పార్టీల్లో కొనసాగుతోంది. అందువల్లే రిజర్వేషన్లు తొలగించాలనే చర్చ చాలా కాలం నుంచి వినిపిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు ఎన్ని మారినా ఆ పని చేయలేకపోతున్నాయి. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా అగ్రవర్ణాల్లోని పేదల కోసం 10 శాతం కోటాతో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీసుకురాగా ఇది తమ వర్గాలకు తీరని అన్యాయానికి గురి చేస్తోందని ఓబీసీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం సీలింగ్□ను ఎత్తేసి జనాభా దమాషా, రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ చెబుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో సోషల్ మీడియాలో గంటగంటకు పుంజుకుంటున్న రిజర్వేషన్ హటావో ఆందోళన్ దేశ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు కారణం కాబోతుదో వేచి చూడాలి.

## ప్రభుత్వానివి నిరంకుశ పోకడలు

**పేదలకు, ధనికులకు వేర్వేరు న్యాయాలా?**

**రంగనాథ్ తొలగింపుపై కవిత కీలక వ్యాఖ్యలు**

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): హైడ్రా కమిషనర్‌గా కొనసాగుతున్న ఐపీఎస్ అధికారి ఏవీ రంగనాథ్‌ను ఆ పదవి నుంచి తక్షణమే తొలగించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో, మాజీ ఎంపీ, తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రస్తుత ప్రభుత్వ నిరంకుశ ధోరణులను హైకోర్టు తీర్పు ఎండగట్టిందని, అక్రమ నిర్మాణాల సాకుతో పేదల ఇళ్లను కూల్చివేస్తున్న ప్రభుత్వానికి ఇది చెంపపెట్టు వంటిదని కవిత విమర్శించారు. ధనిక, పేద అనే తారతమ్యం లేకుండా ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని ఆమె డిమాండ్ చేశారు. న్యాయస్థానం ఉత్తర్వులను పదేపదే ఉల్లంఘిస్తున్న హైడ్రా పనితీరుపై గతంలోనే హైకోర్టు తీవ్ర హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఆ సంస్థ తీరులో మార్పు రాలేదని ఆమె ఆక్షేపించారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాస్తవాలను గ్రహించాలని, పేదలకు ఒక న్యాయం, పెద్దలకు మరొక న్యాయం అన్నట్లుగా కాకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఇదిలావుండగా, హైడ్రా కమిషనర్ పదవి నుంచి రంగనాథ్‌ను తప్పించాలని హైకోర్టు ఈ రోజు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కోర్టు ధిక్కరణ కేసుల్లో ఆయన పదేపదే నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేసిన న్యాయస్థానం, ఆయన కోరిన క్షమాపణను తిరస్కరించింది. రంగనాథ్ స్థానంలో మరో సమర్థుడైన అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది.

## ఇదుగో.. ఈ20 జనతా పార్టీ ఉద్యమం

**నితిన్ గడ్కరీ రాజీనామాకు డిమాండ్**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో విజయం సాధించిన సీజేపీ తరహాలో కొత్త ఉద్యమం ఒకటి మొదలైంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 20 శాతం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ (ఈ20) విధానానికి వ్యతిరేకంగా 'ఈ20 జనతా పార్టీ' పేరుతో ఒక సరికొత్త పౌర ఉద్యమం సోషల్ మీడియాలో పుట్టింది. ఈ గ్రూప్ ఇప్పుడు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజీనామాను డిమాండ్ చేస్తోంది. తాము ఇథనాల్ వాడకానికి పూర్తిగా వ్యతిరేకం కాదని, బంకుల్లో ఈ20తో పాటు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్‌ను కూడా అందుబాటులో ఉంచి, తమ వాహనాలకు ఏది అనుకూలమో ఎంచుకునే స్వేచ్ఛను వినియోగదారులకు ఇవ్వాలని డిమాండ్ చేస్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో 4.09 లక్షలకు పైగా ఫాలోవర్లు, 'ఎక్స్' లో కొద్ది గంటల్లోనే 54 వేల మందికి పైగా మద్దతుదారులను కూడగట్టుకుని ఈ డిజిటల్ ప్రచారం వేగంగా విస్తరిస్తోంది. ఇంధన మిశ్రమాలపై స్పష్టమైన లేబులింగ్ ఉండాలని, వివిధ ఇంధనాల మైలేజ్, ఉద్గారాలు, ఇంజిన్ దీర్ఘకాలిక మన్నికపై పారదర్శకమైన అధ్యయనం వెల్లడించాలని ఈ గ్రూప్ కోరుతోంది. సీజేపీని ఆదర్శంగా తీసుకున్న ఈ కొత్త గ్రూప్, తమది రాజకీయ పార్టీ కాదని, వినియోగదారుల హక్కుల కోసం సామాన్య పౌరులే నడిపిస్తున్న ఉద్యమం అని చెబుతోంది.

## సింగరేణికి కేసీఆర్ మోసం: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సింగరేణి సంస్థను తీవ్రంగా మోసం చేశారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి దక్షిణాదిలోనే అతిపెద్ద బొగ్గు ఉత్పత్తి సంస్థ అని, తెలంగాణతో పాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలతో పాటు ఎన్టీపీసీకి ఇది బొగ్గును సరఫరా చేస్తోందని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తన స్వార్థ రాజకీయాల కోసం సింగరేణిని వాడుకుని, దానికి తీవ్ర ఆర్థిక నష్టాన్ని చేకూర్చిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి ఈ సంస్థలో 49 శాతం వాటా, తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం వాటా ఉందన్న ఆయన... కేసీఆర్ పాలనలో సింగరేణిని ఒక రాజకీయ వేదికగా మార్చేసి, దాని ఆదాయానికి కోలుకోలేని గండి కొట్టారని విమర్శించారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధిని పక్కనబెట్టి రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చారని మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ సింగరేణి పరిస్థితిలో పెద్దగా మార్పు ఏమీ రాలేదని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి, సింగరేణి పునరుద్ధరణకు, కార్మికుల సంక్షేమానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కిషన్ రెడ్డి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## తెలంగాణ జాగృతికి కొత్త సారథి

**మాధవికి బాధ్యతలు అప్పగింత..**

**ఫౌండర్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్న కవిత**

హైదరాబాద్, జూలై 27 (ఈవార్తలు): తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. రెండు దశాబ్దాలుగా సంస్థను నడిపించిన కల్వకుంట్ల కవిత ఇకపై ఫౌండర్ చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. రాష్ట్ర అధ్యక్షురాలి బాధ్యతలను మారిపల్లి మాధవికి అప్పగించారు. సంస్థ ప్రయాణంలో ఇది కొత్త అధ్యాయమని చెబుతున్న నాయకత్వం, తెలంగాణ ఆత్మగౌరవం, సాంస్కృతిక పరిరక్షణ లక్ష్యాలతో ముందుకు సాగుతామనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మారిపల్లి మాధవిని నియమిస్తూ కవిత సోమవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని స్పష్టం చేశారు. సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. కొత్త నాయకత్వంలో జాగృతి మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవం, ఆత్మగౌరవ పరిరక్షణే జాగృతి ప్రధాన లక్ష్యమని కవిత పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం ఉద్ధృతంగా సాగుతున్న సమయంలో తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో 2006లో ఈ సంస్థను స్థాపించినట్లు గుర్తు చేశారు. ఉద్యమానికి సాంస్కృతిక బలం చేకూర్చడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణ ప్రత్యేకతను దేశవ్యాప్తంగా చాటిచెప్పేందుకు సంస్థ నిరంతరం కృషి చేసిందని చెప్పారు. అదే స్ఫూర్తితో ముందుకూ ప్రయాణం కొనసాగుతుందని వెల్లడించారు. తెలంగాణ పల్లెలకే పరిమితమైన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి విశేష కృషి చేసిందని కవిత పేర్కొన్నారు. బతుకమ్మ ఉత్సవాల ద్వారా మహిళలను పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములను చేసిన ఘనత ఈ సంస్థకే దక్కుతుందన్నారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం పెంచేందుకు నిరంతరం పనిచేసిందని వివరించారు.



## సరస్వతి అమ్మవారికి శాకాంబరి అలంకరణ

**నూకపెల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు.. భక్తుల రద్దీ**

మల్యాల, జూలై 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా నూకపెల్లిలోని శ్రీ జ్ఞాన ధ్యాన విజ్ఞాన సరస్వతి దేవాలయంలో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం సందర్భంగా, ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాఖంబరి దేవి అలంకరణతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పంచాయుక్త హోమం, అక్షర స్వీకారాలు, ముడుపు పూజలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కేతరాజు లక్ష్మీ నరసింహారావు తెలిపారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక కార్యక్రమాలకు భక్తులు విశేషంగా హాజరవుతున్నారని ఆయన పేర్కొన్నారు.

## సర్‌లో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

**: దొడ్ల వెంకటేష్ గౌడ్**



కూకట్‌పల్లి, జూలై 27 (ఈవార్తలు): షంషీగూడ డివిజన్ పరిధిలోని షంషీగూడలో జరుగుతున్న సర్ ఓటు మ్యాపింగ్ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల కమిషన్ ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బూత్ లెవెల్ అధికారులు అందజేసే ఎన్యూమరేషన్ ఫారాల్లో పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు. అదేవిధంగా, కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, నకిలీ ఓట్లను పూర్తిగా నిర్మూలించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని వెంకటేష్ గౌడ్ అన్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోపాల్, పోశెట్టి గౌడ్, సుధాకర్, అంజలితో పాటు కాలనీ వాసులు పాల్గొన్నారు.



## బాలానగర్‌లో ఘనంగా న్యూ బ్రెజ్జా గ్రాండ్ లాంచ్

**ముఖ్య అతిథిగా పాల్గొన్న బండి రమేష్**

కూకట్‌పల్లి, జూలై 27 (ఈవార్తలు): బాలానగర్‌లోని మారుతి సుజుకి వరుణ్ మోటార్స్‌లో నిర్వహించిన "ది న్యూ బ్రెజ్జా - కింగ్ ఆఫ్ ఎస్‌యూవీస్" గ్రాండ్ లాంచ్ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన మారుతి సుజుకి బ్రెజ్జా వాహనాన్ని ఆవిష్కరించిన ఆయన, షోరూమ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. భారత ఆటోమొబైల్ రంగంలో మారుతి సుజుకి వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొంటూ నాణ్యమైన సేవలను అందిస్తోందని కొనియాడారు. వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక సాంకేతికత, మెరుగైన భద్రతా ప్రమాణాలు, ఆధునిక సౌకర్యాలతో రూపొందించిన న్యూ బ్రెజ్జా మార్కెట్లో విశేష ఆదరణ పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.సి. రాజు, జనరల్ మేనేజర్ కృష్ణ, ఏజీఎం ఆంజనేయులు, బ్రాంచ్ మేనేజర్ శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, పుష్ప రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గాలి బాలాజీ, కలికోట బాలరాజు, శివకుమార్, శ్రీకాంత్ పటేల్, గంధం రాజు, మధు, రాము, వాసు, క్రాంతి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.6 లక్షల ఎల్‌వోసీ

జగిత్యాల టౌన్, జూలై 27 (ఈవార్తలు): జగిత్యాల పట్టణానికి చెందిన మామిడాల కిషోర్‌కుమార్ జీర్ణవ్యవస్థ సంబంధిత సమస్యతో బాధపడుతూ చికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) ద్వారా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం రూ.6 లక్షల విలువైన ఎల్‌వోసీని మామిడాల కిషోర్‌కుమార్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్, 34 వార్డ్ కౌన్సిలర్ ఆయ్యూబ్ ఖాన్, ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు సుమేర్ ఉద్దీన్ అజాద్, ప్రవీణ్‌రావు, ఆకుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## డీసీఆర్‌బీ డీఎస్పీగా రవి కుమార్ బాధ్యతలు

జగిత్యాల, జూలై 27 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) డీఎస్పీగా రవి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సోమవారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీకి పూల బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బోర్నపల్లి వంతెన రూ.కోటి ఎటుపాయే?

**నాడు మంత్రిగా ఉన్న జీవన్ రెడ్డి ఎందుకు పూర్తి చేయలే?**

**బోర్నపల్లి-జగన్నాథ్‌పూర్ వంతెనపై ఎమ్మెల్యే సంజయ్ నిలదీత**

జగిత్యాల, జూలై 27 (ఈవార్తలు): బోర్నపల్లి-జగన్నాథ్‌పూర్ వంతెన నిర్మాణంపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ తీవ్రంగా స్పందించారు. జగిత్యాల మోతే రోడ్డు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వంతెన నిర్మాణానికి సంబంధించి మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేసిన విషయాన్ని జీవన్‌రెడ్డి ప్రశ్నించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. గతంలో కేంద్ర మంత్రి జువెల్ ఓరంను ఎంపీ అరవింద్‌తో కలిసి ఢిల్లీలో కలసి జగన్నాథ్‌పూర్ వంతెన నిర్మాణానికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కోరడంతో తన సూచన మేరకు వంతెన నిర్మాణ ప్రతిపాదనలు కేంద్రానికి పంపినట్లు చెప్పారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత బోర్నపల్లి-జగన్నాథ్‌పూర్ వంతెన నిర్మాణానికి కృషి చేశారని, ఈ అంశంపై తొలి సంతకం చేశారని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు చేపట్టకపోవడంతో మళ్లీ టెండర్ ప్రక్రియ చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పనులు త్వరగా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని మంత్రికి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. 2012లో బోర్నపల్లి వంతెనకు రూ.కోటి నిధులు మంజూరయ్యాయని అప్పటి నాయకులు ప్రకటించారని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఆ నిధులు ఏమయ్యాయో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. గతంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా ఉన్న జీవన్‌రెడ్డి బోర్నపల్లి-జగన్నాథ్‌పూర్‌తో పాటు ఇటిక్యాల-రామారావుపల్లి, రామాజీపేట, కోనాపూర్, మైతాపూర్ వంతెనలను ఎందుకు పూర్తి చేయలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పీఎం జన్మన్ పథకం కింద కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై సీనియర్ నాయకులు ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. గతంలో తెలిసిన కాంట్రాక్టర్లతో పనులు చేయడాన్ని వ్యతిరేకించినవారే ఇప్పుడు అదే విధంగా మాట్లాడటం ఆశ్చర్యంగా ఉందన్నారు. గతంలో బీఆర్‌ఎస్, కేసీఆర్, ఆయన కుటుంబాన్ని తీవ్రంగా విమర్శించిన జీవన్‌రెడ్డి.. ప్రస్తుతం రహస్య ఒప్పందంలో భాగంగానే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆరోపించారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఢిల్లీ గడ్డపై జర్నలిస్టుల గళం

**గళమెత్తిన టీడబ్ల్యూజేఎఫ్.. జంతర్ మంతర్ లో తెలంగాణ జర్నలిస్టుల ధర్నా**




న్యూఢిల్లీ, జూలై 27: దేశవ్యాప్తంగా జర్నలిస్టుల సమస్యల పై తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో గళమెత్తారు. కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ పాత్రికేయులు పార్లమెంటు సమీపంలోని జంతర్ మంతర్ లో పెద్ద ఎత్తున ధర్నా చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన "ఛలో పార్లమెంట్" పిలుపునందుకొని రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఢిల్లీ తరలివచ్చిన పాత్రికేయులు ధర్నాలో పాల్గొని సమస్యలపై గొంతెత్తారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాను ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నాయకులు, ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు మారూఫ్ రజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు సంబంధించిన సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులందరి పక్షాన తెలంగాణ జర్నలిస్టులు ఢిల్లీలో పార్లమెంట్ వద్ద ధర్నా చేయడం అభినందనీయమని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పాత్రికేయుల సంక్షేమం, భద్రత, హక్కుల పరిరక్షణ కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ముందుండి పోరాటం చేయడం గొప్ప విషయమని అన్నారు. ధర్నా కార్యక్రమంలో జర్నలిస్టుల సంక్షేమానికి సంబంధించిన పలు కీలక డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన జర్నలిస్టులు కూడా ఈ ధర్నాలో పాల్గొని ఉద్యమానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశంలోని ప్రతి పాత్రికేయుడి హక్కుల కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. ఈ ధర్నాలో ఢిల్లీ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఉపాధ్యక్షుడు లియాఖత్, సభ్యులు మాన్విక మిశ్రా, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, రాష్ట్ర నాయకులు కుంచం శ్రీనివాస్, కుడుతాడి బాపురావు, కే. రమాదేవి, జగదీశ్వర్, పద్మనాభ రావు, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్ధరణ, రిటైర్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జర్నలిస్టుల రక్షణ చట్టం, నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు పునఃసమీక్ష తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ లకు అందజేశారు.



## డీఏపీ బ్లాక్ మార్కెట్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌కు బీజేపీ నాయకురాలు డాక్టర్ భోగ శ్రావణి వినతి**

జగిత్యాల, జూలై 27 (ఈవార్తలు): రైతులకు డీఏపీ ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న డీలర్లపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకురాలు డా. భోగ శ్రావణి డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఏపీ ఎరువుల ఎమ్మార్పీ ధర రూ.1,350 ఉండగా, కొందరు డీలర్లు ఒక్కో బస్తాను రూ.1,950 వరకు విక్రయిస్తూ రైతుల నుంచి అదనంగా రూ.600 వసూలు చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువులపై రైతులకు ఉన్న అత్యవసరాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నారని అన్నారు. అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరకే డీఏపీ ఎరువులు అందేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రైతులకు న్యాయం జరిగే వరకు బీజేపీ వారి పక్షాన నిలుస్తుందని డా. భోగ శ్రావణి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్దం తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శులు ముత్యం రెడ్డి, పాత రమేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా యువ మోర్చా అధ్యక్షుడు ఇట్టేడి రాజు (శేఖర్‌రెడ్డి), ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నారపక అశోక్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల శ్రీనివాస్, జ్ఞానేశ్వర్ తదితర జిల్లా, మండల పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**విద్యార్థులపై ఫీజుల భారం తగ్గించాలి**

విద్యార్థులపై పెరుగుతున్న విద్యా ఫీజుల భారాన్ని తగ్గించి, ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేపీ యువమోర్చా జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన 'ఫీజుల బకాయి-బీజేపీ లడాయి' కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డా. భోగ శ్రావణి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల అధిక ఫీజులతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు విద్యార్థులు మిస్‌కాల్ ద్వారా ఉద్యమానికి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమతతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, రైతుల వినతి**



జగిత్యాల, జూలై 27 (ఈవార్తలు): ఎల్నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు ఆందోళనలో ఉన్న సమయంలో యూరియా, డీఏపీ తదితర ఎరువులను అధిక ధరలకు బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాలు ఆలస్యంగా కురవడం, వర్షపాతం అస్థిరంగా ఉండటంతో రైతులు ఇప్పటికే తీవ్ర ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులకు అండగా నిలవాల్సింది పోయి, ప్రభుత్వ నిర్ణయించిన ధరలకు ఎరువులు అందకుండా బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించడం దారుణమన్నారు. ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు ప్రభుత్వ నిర్లక్ష్యం, బ్లాక్ మార్కెట్ మాఫియా కారణంగా రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆరోపించారు. పంటను కాపాడుకోవాలనే ఆత్రంతో రైతులు ఎంత ధరైనా చెల్లించి ఎరువులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా, డీఏపీ ఎరువులు ఎమ్మార్పీ ధరకే అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఎరువుల ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడంలో నిర్లక్ష్యం వహిస్తోందని వసంత సురేష్ విమర్శించారు. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను వెంటనే అరికట్టి రైతులకు ఉపశమనం కల్పించాలని కోరారు. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పీఏసీఎస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయిల్నేని ఆనంద్‌రావు, తుమ్మ గంగాధర్, తేలు రాజు, ఎల్లా రాజన్న, నాడెం శంకర్, జక్కుల తిరుపతి, బక్కశెట్టి అంజన్న, ఆదిరెడ్డి రామకిషన్, ధర్మయ్య, గంగారెడ్డి, చిరంజీవి, బాలే చందు, మోహన్, భాస్కర్‌నాయక్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



## ఎత్తిపోతల మోటర్లకు మరమ్మతులు చేయాలి

**ఆగస్టు 1లోగా పంపుసెట్లు సిద్ధం చేయాలి: జీవన్‌రెడ్డి**

బీర్పూర్, జూలై 27 (ఈవార్తలు): ఎత్తిపోతల పథకాల మోటర్లకు మరమ్మతులు చేపట్టి ఖరీఫ్ పంటలకు సాగునీరు అందించాలని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం బీర్పూర్ మండలం కొల్వాయి ఎత్తిపోతల పథకాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. కాలిపోయిన మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు లేక నీరు అందక రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన జీవన్‌రెడ్డి కొల్వాయి, ఆరేపల్లి ప్రాంతాల్లో మోటర్లను మరమ్మతు చేయాలని, కమ్మునూరు, మంగెలలో ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని కోరారు. ఏడాదిగా పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ఆగస్టు 1లోగా అన్ని పంపుసెట్లను సిద్ధం చేయాలని సూచించారు. నీరు ఉండి కూడా పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రైతుల సమస్యలు పరిష్కరించకపోతే ప్రజావాణి ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు.

## టీఆర్‌ఎస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జిగా అంకం శివరాణి

కరీంనగర్, జూలై 27 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జిగా అంకం శివరాణి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తనపై కొండంత నమ్మకంతో ఈ కీలక బాధ్యతలను అప్పగించిన పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర బాధ్యులకు, జిల్లా అధ్యక్షులకు మరియు జిల్లా స్థాయి నాయకులందరికీ ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, కరీంనగర్ నియోజకవర్గంలో పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. అలాగే, నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ పోరాడతానని ఈ సందర్భంగా అంకం శివరాణి స్పష్టం చేశారు.



## రోడ్డుపై కూరగాయల వ్యాపారానికి చెక్

జగిత్యాల, జూలై 27 (ఈవార్తలు): పట్టణంలోని రైతుబజార్ పరిసర ప్రాంతాల్లో రహదారులపై కూరగాయల వ్యాపారం నిర్వహించడం వల్ల ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యకు అధికారులు పరిష్కారం చూపారు. రోడ్లపై వ్యాపారం చేస్తున్న హోల్‌సేల్, రిటైల్ కూరగాయల వ్యాపారులను రైతుబజార్ ప్రాంగణంలోకి తరలించారు. టౌన్ సీఐ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ బి. మల్లేష్, మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్, వార్డు కౌన్సిలర్ అరవ లక్ష్మి, ట్రాఫిక్ పోలీసు, మున్సిపల్ సిబ్బంది కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులపై వ్యాపారం చేయడం వల్ల వాహనదారులు, పాదచారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వ్యాపారులకు వివరించారు. అధికారులు కల్పించిన అవగాహనకు స్పందించిన వ్యాపారులు స్వచ్ఛందంగా రైతుబజార్‌లోకి వెళ్లి వ్యాపారాలు ప్రారంభించారు. రైతుబజార్ ప్రాంగణంలోకి ద్విచక్ర వాహనాలు, ఆటోరిక్షాలు ప్రవేశించకుండా మార్కెట్ ప్రవేశ ద్వారాల వద్ద నిషేధ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీంతో పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు తగ్గడంతో పాటు ట్రాఫిక్ రద్దీ కూడా గణనీయంగా తగ్గింది. ఇకపై రైతుబజార్ వెలుపల రహదారులపై కూరగాయల వ్యాపారం నిర్వహించరాదని అధికారులు సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జగిత్యాల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు, ప్రజలకు సురక్షితమైన రాకపోకలు కల్పించేందుకు ఇలాంటి ప్రత్యేక చర్యలు కొనసాగుతాయని టౌన్ సీఐ పి. కరుణాకర్, ట్రాఫిక్ ఎస్ఐ బి. మల్లేష్ తెలిపారు.

# పల్లెలు.. గల్లా పెట్టెలు



## మారిన గ్రామీణ ఆర్థికం రూపురేఖలు

**రుణ పంపిణీ వ్యవస్థతో బ్యాంకింగ్ వికాసం**

**77.2 శాతం కుటుంబాల్లో పెరిగిన కొనుగోలు శక్తి**

**58.63 కోట్ల జన్‌ధన్ ఖాతాలు.. 3 లక్షల కోట్ల డిపాజిట్లు**

**వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి.. రైతులకు రుణాలు**

భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే గ్రామీణ రంగానికి రుణ పంపిణీ వ్యవస్థ కొండంత అండగా నిలుస్తోంది. ఒకప్పుడు ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దోపిడీకి గురైన పల్లెలు.. నేడు సంస్థాగత, పారదర్శక బ్యాంకింగ్ వైపు వేగంగా అడుగులు వేశాయి. నాబార్డ్, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు(ఆర్ఆర్‌బీ), సహకార సంఘాలు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకుల సమన్వయంతో గ్రామీణ రుణ వ్యవస్థ అద్భుతంగా రూపాంతరం చెందింది. సరసమైన వడ్డీ రేట్లకే సమయానికి రుణాలు అందుతుండటంతో వ్యవసాయం, అనుబంధ రంగాలు రూపురేఖలు మార్చుకుంటున్నాయి. ఇటీవల వెలువడిన 'నాబార్డ్ సర్వే' ప్రకారం 77.2 శాతం గ్రామీణ కుటుంబాల్లో కొనుగోలు శక్తి, వినియోగ స్థాయి గణనీయంగా పెరిగాయి.

**వ్యవస్థ విస్తరణతో మారిన పల్లెల స్వరూపం**

ప్రభుత్వ విధానపరమైన నిర్ణయాలతో దేశంలోని మారుమూల ప్రాంతాలకూ బ్యాంకింగ్ సేవలు చేరువయ్యాయి. 2014లో దేశవ్యాప్తంగా 41,464గా ఉన్న షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల గ్రామీణ శాఖలు, ఏకంగా 35 శాతానికి పైగా పెరిగి 56,193కు చేరుకున్నాయి. ప్రస్తుతం దేశంలోని 99.92 శాతం గ్రామాల్లో కేవలం 5 కిలోమీటర్ల పరిధిలోనే ఏదో ఒక బ్యాంకింగ్ సేవా కేంద్రం అందుబాటులో ఉండటం విశేషం. 28 ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు(ఆర్ఆర్‌బీలు) 700 జిల్లాల్లో 22,000 పైగా శాఖలతో సేవలు అందిస్తుండగా, 58.63 కోట్లకు పైగా ఉన్న జన్ ధన్ ఖాతాల్లో 77.8 శాతం గ్రామీణ ప్రాంతాలకు చెందినవే కావడం సామాజిక సమ్మిళితత్వానికి నిదర్శనం.

**రైతు సంక్షేమానికి 'కేసీసీ' తోడు..**

రైతన్నలకు పెట్టుబడి సాయం అందించే కిసాన్ క్రెడిట్ కార్డ్(కేసీసీ) పథకం, సవరించిన వడ్డీ రాయితీ పథకం(ఎంఐఎస్ఎస్) గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలపరిచాయి. ఎంఐఎస్ఎస్ కింద కేసీసీ ద్వారా లభించే స్వల్పకాలిక రుణ పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచగా, పూచీకత్తు లేని రుణ పరిమితిని రూ. 2 లక్షలకు పెంచారు. రుణాలను సమయానికి చెల్లించే రైతులకు కేవలం 4 శాతం వడ్డీకే రుణాలు అందుతున్నాయి. నాబార్డ్ ప్రవేశపెట్టిన 'ఈ-కేసీసీ' డిజిటల్ పోర్టల్, జన్ సమర్థ్ పోర్టల్‌ల ద్వారా రైతులు బ్యాంకులకు వెళ్లే పనిలేకుండానే కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా కేవలం 2 రోజుల్లోనే రుణ మంజూరు పొందుతున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ వ్యవసాయ రంగానికి రూ. 32.50 లక్షల కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించడం గమనార్హం.

**మహిళల చేతిలో ఆర్థిక శక్తి**

గ్రామీణ పేదరిక నిర్మూలనలో ఎస్‌హెచ్‌జీలు, డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం కార్యక్రమాలు విప్లవాత్మక మార్పు తీసుకొచ్చాయి. దేశవ్యాప్తంగా 10.05 కోట్ల మంది గ్రామీణ మహిళలు 90.90 లక్షలకు పైగా ఎస్‌హెచ్‌జీలలో సభ్యులుగా మారి స్వయం సమృద్ధి సాధించారు. పథకం ప్రారంభం నుంచి ఇప్పటివరకు ఎస్‌హెచ్‌జీలకు రూ. 13.28 లక్షల కోట్ల రుణాలు పంపిణీ చేయగా, 50,000 మందికి పైగా ఉన్న 'బ్యాంక్ సఖీలు' గ్రామీణ మహిళలకు రుణ ప్రక్రియను ఎంతో సులభతరం చేశారు. డిజిటలైజేషన్, సమ్మిళిత రుణ ప్రణాళికలు, సవరించిన ప్రభుత్వ విధానాల కారణంగా భారత గ్రామీణ ప్రాంతాలు స్వయం సమృద్ధి దిశగా వేగంగా పయనిస్తున్నాయి.

## 'ఇండియన్ ఐడల్ 16' విన్నర్ జ్యోతిర్మయి నాయక్

ముంబై: ప్రముఖ సింగింగ్ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్ 16' విజేతగా ఒడిశాకు చెందిన జ్యోతిర్మయి నాయక్ నిలిచారు. ఆదివారం అట్టహాసంగా జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఆమె ట్రోఫీని కైవసం చేసుకున్నారు. ఈ విజయంతో ఆమె రూ. 20 లక్షల నగదు బహుమతిని కూడా గెలుచుకున్నారు. ఫైనల్‌లో తనిష్క్ శుక్లా, అన్షికా చోంకర్, మన్‌రాజ్ వీర్ సింగ్, మైస్కమ్ బోసు, సుహైల్ సూఫీలతో పోటీపడి జ్యోతిర్మయి విజేతగా అవతరించారు. ఇండియన్ ఐడల్ చరిత్రలో ఒడిశా నుంచి టైటిల్ గెలుచుకున్న తొలి కంటెస్టెంట్‌గా ఆమె రికార్డు సృష్టించి, తన రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన 25 ఏళ్ల జ్యోతిర్మయి నాయక్, ఇండియన్ ఐడల్ ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందకముందే ఒడిశా ప్రాంతీయ సంగీత పరిశ్రమలో సుపరిచితురాలు. ఆమె ఒక గాయని మాత్రమే కాదు, శిక్షణ పొందిన మ్యూజిక్ థెరపిస్ట్ కూడా. సంగీతం ద్వారా మానసిక, భావోద్వేగ సమస్యలకు చికిత్స అందించడంలో ఆమెకు నైపుణ్యం ఉంది. 'ఎపిక్ ఆరా లైఫ్' అనే ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్ కథనం ప్రకారం.. రూర్కెలాలో జన్మించిన జ్యోతిర్మయి తల్లిదండ్రులు చక్రధర్ నాయక్, గౌరీ నాయక్. సంగీతంపై మక్కువ ఉన్న ఆమె తండ్రి, ఆమెను వృత్తిపరంగా ఈ రంగంలో ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించారు.

## ఇరాన్ నౌకపై ఉక్రెయిన్ దాడి

**తీవ్ర పరిణామాలుంటాయని టెహ్రాన్ హెచ్చరిక!**

టెహ్రాన్: కాస్పియన్ సముద్రంలో ప్రయాణిస్తున్న తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ బలగాలు జరిపిన దాడిలో ఒక నావికుడు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ దాడిపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తమ దేశ భద్రతను, ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఎంతటి కఠిన చర్యలకైనా వెనకాడబోమని స్పష్టం చేసింది. ఈ చర్యకు పాల్పడిన ఉక్రెయిన్‌కు రాబోయే రోజుల్లో తగిన శాస్తి జరుగుతుందని, యుద్ధం మరింత ముదరకుండా చూడాలంటే కీవ్ వైఖరిని ఐరోపా దేశాలు వెంటనే అడ్డుకోవాలని డిమాండ్ చేసింది. పశ్చిమాసియాలో ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ ఈ ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. తమకు రష్యా-ఉక్రెయిన్ పోరుతో ఎలాంటి సంబంధం లేదని ఇరాన్ పదేపదే చెబుతున్నప్పటికీ... రష్యా నుంచి ఇరాన్ శాటిలైట్ సమాచారాన్ని పొందుతోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఆరోపించారు. గల్ఫ్ ప్రాంతాలు, అమెరికా మిలిటరీ స్థావరాలపై రష్యా సేకరించిన ఉపగ్రహ చిత్రాలను ఇరాన్ తన దాడుల కోసం వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. అమెరికా విధించిన ఆంక్షల వల్ల చైనా తదితర దేశాల నుంచి వస్తువుల రవాణాకు ఇరాన్‌కు ఈ కాస్పియన్ సముద్ర మార్గమే దిక్కుగా మారింది. అలాంటి కీలకమైన దారిలో నౌకపై దాడి జరగడం అంతర్జాతీయంగా తీవ్ర ఆందోళనకు దారితీస్తోంది.

## తమిళనాడులో చికెన్ అమ్మకాలు బంద్

చెన్నై: తమిళనాడులో చికెన్ ప్రియులకు నిరాశ కలిగించే వార్త. రాష్ట్రవ్యాప్తంగా జూలై 31 నుంచి చికెన్ అమ్మకాలను నిరవధికంగా నిలిపివేయనున్నట్లు తమిళనాడు చికెన్ ట్రేడర్స్ ఫెడరేషన్ ప్రకటించింది. బ్రాయిలర్ కంపెనీలు ప్రభుత్వ ఫీడింగ్ నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘిస్తుండటమే ఈ నిర్ణయానికి కారణమని స్పష్టం చేసింది. ఈ బంద్‌కు పుదుచ్చేరిలోని చికెన్ వ్యాపారులు కూడా మద్దతు ప్రకటించడంతో, రెండు ప్రాంతాల్లోనూ చికెన్ లభ్యతపై ప్రభావం పడనుంది. తమిళనాడు చికెన్ ట్రేడర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బి. దురైరాజ్ సోమవారం ఈ విషయంపై ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం, ఫారం నుంచి కోళ్లను డెలివరీ చేయడానికి కనీసం 12 గంటల ముందు వాటికి మేత వేయడం ఆపివేయాలి. దీనిని "ఫీడ్ విత్‌డ్రాయల్" అంటారు. అయితే, బ్రాయిలర్ కంపెనీలు ఈ నిబంధనను ఏమాత్రం పాటించడం లేదని ఆయన ఆరోపించారు. డెలివరీ సమయం వరకు మేత వేయడం వల్ల, రవాణా సమయంలో కోళ్లు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఇది ప్రజారోగ్యానికి తీవ్ర ప్రమాదకరమని దురైరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా కంపెనీలు స్పందించకపోవడంతో, విక్రయాలు నిలిపివేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

## కెనడాలో భారత యువతి హత్య

టొరంటో: కెనడాలో భారత సంతతికి చెందిన యువతి దారుణ హత్యకు గురైంది. పంజాబ్‌కు చెందిన 26 ఏళ్ల నవనీత్ కౌర్‌ను టొరంటోలో పట్టపగలే కాల్చి చంపారు. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిన దాడి అని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించి పంజాబ్‌కే చెందిన 37 ఏళ్ల వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టొరంటో పోలీసుల కథనం ప్రకారం, జూలై 24వ తేదీ ఉదయం 7:23 గంటల సమయంలో ఎటోబికోక్ ప్రాంతంలోని హంబర్‌వుడ్ బౌలేవార్డ్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కాల్పులు జరిగినట్లు సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, తీవ్ర గాయాలతో పడి ఉన్న నవనీత్‌ను గుర్తించారు. వైద్య సిబ్బంది ఆమెను కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం, నిందితుడు నవనీత్‌ను వెంబడించి, ఆమెతో కొద్దిసేపు సంభాషించిన అనంతరం ఒక్కసారిగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. అయితే వారిద్దరి మధ్య ఎలాంటి వాగ్వాదం జరిగినట్లు కనిపించలేదని సాక్షులు తెలిపారు. ఈ ఘటన అనంతరం పోలీసులు డ్రోన్లు, డాగ్ స్క్వాడ్‌లతో ముమ్మర గాలింపు చేపట్టారు. నిందితుడిని బ్రాంప్టన్‌కు చెందిన శరణ్‌జిత్ సింగ్‌గా గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు.

## ఫ్రాన్స్‌లో ఇన్ఫోసిస్‌కు రూ.2 కోట్ల జరిమానా

లండన్: భారత ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్‌కు ఫ్రాన్స్‌లో భారీ జరిమానా పడింది. ఉద్యోగుల పని గంటలను నమోదు చేసే వ్యవస్థ స్థానిక కార్మిక చట్టాలకు అనుగుణంగా లేదని గుర్తించిన ఫ్రెంచ్ కార్మిక శాఖ చర్యలు చేపట్టింది. ఈ మేరకు సుమారు 1.75 లక్షల యూరోల (దాదాపు రూ.2 కోట్లు) జరిమానా విధించింది. ఈ విషయాన్ని ఇన్ఫోసిస్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు ఇచ్చిన సమాచారం ద్వారా వెల్లడించింది. ఫ్రాన్స్‌లో ఉద్యోగుల పని గంటలు, అదనపు పని సమయం, తప్పనిసరి విశ్రాంతి సమయాలను కచ్చితంగా నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే ఆ రికార్డులు విశ్వసనీయంగా ఉండటంతో పాటు అవసరమైనప్పుడు పరిశీలించగలిగేలా ఉండాలని అక్కడి చట్టాలు చెబుతున్నాయి. అయితే ఇన్ఫోసిస్ ఉపయోగిస్తున్న టైమ్-ట్రాకింగ్ వ్యవస్థ ఈ ప్రమాణాలను పూర్తిగా పాటించలేదని ఫ్రెంచ్ కార్మిక శాఖ తేల్చింది. ముఖ్యంగా రికార్డుల విశ్వసనీయత, ఆడిట్‌కు అనువుగా ఉండటం, కొంతమంది ఉద్యోగుల పని గంటల పర్యవేక్షణలో లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ఈ జరిమానా వల్ల కంపెనీ ఆర్థిక పరిస్థితి లేదా వ్యాపార కార్యకలాపాలపై పెద్దగా ప్రభావం ఉండదని ఇన్ఫోసిస్ స్పష్టం చేసింది. అధికారుల నుంచి వచ్చిన సమాచారాన్ని పరిశీలిస్తున్నామని, తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపింది.

## 'ఈ20' పోస్టులపై గడ్కరీ ఫైర్

**బాంబే హైకోర్టులో దావా**

ముంబై: తన పేరును ఈ20 ఇథనాల్ కార్యక్రమంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో ప్రచారమైన పోస్టులు, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ న్యాయపోరాటానికి దిగారు. తనతో పాటు కుటుంబ సభ్యులు ఈ20 విధానం వల్ల లబ్ధి పొందినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మెటాతో పాటు ఇతర సోషల్ మీడియా వేదికలు, గుర్తుతెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ20 ఇథనాల్ కార్యక్రమం వల్ల తన కుటుంబం లాభపడిందంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వివరించారు. ఈ పోస్టులు, డీప్‌ఫేక్ కంటెంట్ ముంబయిలో కూడా అందుబాటులో ఉండటంతో బాంబే హైకోర్టుకు ఈ కేసును విచారించే అధికారం ఉందని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అభయ్ అహూజా.. సివిల్ సూట్ దాఖలు చేసేందుకు అనుమతి మంజూరు చేశారు. ఈ పరిణామానికి రెండు వారాల ముందు నాగ్‌పూర్‌లోనూ ఇదే అంశంపై కేసు నమోదైంది. ఈ20 కార్యక్రమానికి సంబంధించి కేంద్ర మంత్రిపై తప్పుడు సమాచారం ప్రచారం చేశారనే ఆరోపణలతో నలుగురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వారిలో యూట్యూబర్, రాజకీయ నాయకుడు మనీష్ కశ్యప్‌తో పాటు 'దేశీ బాయ్స్' పేరుతో ఉన్న ఇన్‌స్టాగ్రామ్ ఖాతా, హర్షిత్ రాఠీ పేర్లు ఉన్నాయి. ఈ20 ఇంధన విధానంపై దేశవ్యాప్తంగా చర్చ కొనసాగుతోంది. 20 శాతం ఇథనాల్, 80 శాతం పెట్రోల్‌తో కూడిన ఈ ఇంధనం అనుకూల వాహనాలకు సురక్షితమేనని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే పాత వాహనాల పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉందంటూ కొందరు వాహనదారులు, ఆటోమొబైల్ నిపుణులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

## దేశీయ మార్కెట్లకు భారీ లాభాలు

ముంబై: వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్ల పాటు నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా పుంజుకున్నాయి. ముడిచమురు ధరలు తగ్గడం, అంతర్జాతీయ ఉద్రిక్తతలు సద్దుమణగడంతో ఇన్వెస్టర్లలో కొనుగోళ్ల ఉత్సాహం పెరిగింది. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ రెండు శాతానికి పైగా లాభపడ్డాయి. నిఫ్టీ మళ్లీ 24 వేల మార్కుకు చేరువైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 776.29 పాయింట్లు ఎగిసి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 229.40 పాయింట్లు పెరిగి 23,995.95 వద్ద స్థిరపడింది. అమెరికా, ఇరాన్ మధ్య సైనిక చర్యలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ముడిచమురు ధరలు తగ్గాయి. దీంతో దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు ఉపశమనం లభిస్తుందనే అంచనాలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. నిఫ్టీ షేర్లలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఇన్ఫోసిస్ అత్యధిక లాభాలు నమోదు చేశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మెరుగ్గా రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 1.11 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.31 శాతం పెరిగాయి. ఐటీ, మీడియా, రియాల్టీ రంగాల షేర్లు కొనుగోళ్లతో కళకళలాడాయి. రియాల్టీ, ఫార్మా, మెటల్ సూచీలు కూడా మూడు రోజుల నష్టాల నుంచి బయటకొచ్చాయి. మరోవైపు ఆయిల్ అండ్ గ్యాస్ సూచీ మాత్రం ఇతర రంగాలతో పోలిస్తే బలహీనంగా కనిపించింది. ముడిచమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం, ఐటీ షేర్లలో కొనుగోళ్లు, కంపెనీల మెరుగైన త్రైమాసిక ఫలితాలు మార్కెట్‌కు మద్దతుగా నిలిచాయని విశ్లేషకులు పేర్కొన్నారు.

## మంచినీటి చేపల్లో క్యాన్సర్



న్యూయార్క్: ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా మంచినీటి చేపల్లో ఒకదాని నుంచి మరొకదానికి సంక్రమించే క్యాన్సర్‌ను శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా క్యాన్సర్ అనేది ఒక జీవి శరీరంలోని కణాల్లో చోటుచేసుకునే మార్పుల వల్ల సంభవిస్తుంది. అయితే, దీనికి భిన్నంగా ఈ వ్యాధి సజీవ క్యాన్సర్ కణాల రూపంలో ఒక చేప నుంచి మరొక చేపకు నేరుగా వ్యాపిస్తోంది. ఉత్తర అమెరికాలోని అమెరికా-కెనడా సరిహద్దుల్లో గల 'మెమ్‌ఫ్రేమాగోగ్' సరస్సులో నివసించే బ్రౌన్ బుల్‌హెడ్ క్యాట్‌ఫిష్ జాతి చేపల్లో ఈ అరుదైన వ్యాధిని కనుగొన్నారు. ఈ పరిశోధనకు సంబంధించిన వివరాలు ప్రఖ్యాత సైన్స్ జర్నల్ 'నేచర్'లో ప్రచురితమయ్యాయి. చేపల నుంచి సేకరించిన క్యాన్సర్ కణితులు (ట్యూమర్లు), ఆరోగ్యకరమైన కణజాలాలను శాస్త్రవేత్తలు జన్యుక్రమ విశ్లేషణ (జీనోమ్ సీక్వెన్సింగ్) చేశారు. వేర్వేరు చేపల్లోని క్యాన్సర్ కణితులు వాటి సొంత శరీర కణాల కంటే కూడా, జన్యుపరంగా ఒకదానికొకటి అత్యంత సారూప్యతను కలిగి ఉన్నట్లు ఈ విశ్లేషణలో తేలింది. తద్వారా ఈ క్యాన్సర్ ఒకే మూలం నుంచి వ్యాప్తిస్తోందని పరిశోధకులు నిర్ధారించారు. జంతు ప్రపంచంలో కుక్కలు, టాస్మానియన్ డెవిల్స్, కొన్ని సముద్ర జీవుల తర్వాత ఇటువంటి వ్యాప్తి చెందే క్యాన్సర్‌ను గుర్తించడం ఇది నాలుగోసారి. సుమారు 2012లో జాలర్లు, జీవశాస్త్రవేత్తలు ఈ చేపల చర్మంపై నల్లటి మచ్చలను గమనించారు. 2015 నాటికి ఆ సరస్సులోని 23 శాతం నుంచి 37 శాతం చేపలు ఈ క్యాన్సర్ బారిన పడినట్లు సర్వేల్లో ద్వారా వెల్లడైంది. చేపలు గుంపులుగా ఉన్నప్పుడు ఒకదానికొకటి తాకడం వల్ల లేదా నీటి ద్వారా క్యాన్సర్ కణాలు వ్యాపిస్తుండవచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. అయితే, ఈ క్యాన్సర్ మనుషులకు గానీ, ఇతర జీవజలానికి గానీ సోకే ప్రమాదం ఉందని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. క్యాన్సర్ ఎలా పరిణామం చెందుతుంది మరియు ఎలా వ్యాప్తి చెందుతుంది అనే అంశాలపై ఈ నూతన ఆవిష్కరణ కీలక అవగాహన కల్పిస్తుందని వారు పేర్కొన్నారు.

## ముజఫరాబాద్‌కు లాంగ్ మార్చ్

**పీఓకేలో మళ్లీ ఉద్రిక్తత.. బలప్రయోగం చేయొద్దని పాక్‌కు యూకేపీఎన్‌పీ విజ్ఞప్తి**



ముజఫరాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ' (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. అక్కడి నుంచి నేడు ముజఫరాబాద్‌కు లాంగ్ మార్చ్‌గా బయలుదేరాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్ ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ), పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ) దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం. జూన్ 5 నుంచి పీఓకేలో కొనసాగుతున్న అశాంతి కారణంగా 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు నివేదికలు చెబుతున్నాయని యూకేపీఎన్‌పీ పేర్కొంది. ప్రతి మరణం, గాయంపై స్వతంత్రంగా, నిష్పాక్షికంగా విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. అలాగే ఐక్యరాజ్యసమితి (యూఎన్), యూరోపియన్ యూనియన్ (ఈయూ), అమెరికా, బ్రిటన్, రష్యాతో పాటు అంతర్జాతీయ సమాజం జోక్యం చేసుకొని పౌరుల భద్రత, శాంతియుత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరింది. అంతర్జాతీయ మీడియా, మానవ హక్కుల సంస్థలు కూడా పీఓకేలోని పరిణామాలను నిశితంగా గమనించి, ఉల్లంఘనలపై స్వతంత్రంగా నివేదికలు ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. విద్యుత్ ఛార్జీలు తగ్గించడం, మంగ్లా జలవిద్యుత్ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను స్థానికులకు తక్కువ ధరకే అందించడం, నిత్యావసర వస్తువులపై సబ్సిడీల వంటి డిమాండ్లతో దాదాపు గత రెండు నెలలుగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదనపు పన్నుల రద్దు, స్థానికులకు అధిక రాజకీయ-పరిపాలనా అధికారాలు, అవినీతిపై చర్యలు, అరెస్టయిన నిరసనకారుల విడుదల, కేసుల ఉపసంహరణ వంటి మొత్తం 38 డిమాండ్లతో పాకిస్థాన్ ప్రభుత్వంతో జేఏఏసీ పలుసార్లు చర్చలు జరిపింది. అయితే కీలక అంశాలపై అంగీకారం కుదరకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో ప్రజలను మరోసారి సమీకరించి లాంగ్ మార్చ్‌కు జేఏఏసీ పిలుపునిచ్చింది.

## ఆందోళనలు చేస్తే లాఠీచార్జ్ చేస్తారా?

**ఢిల్లీ పోలీసుల తీరుపై సుప్రీం ఆగ్రహం**



న్యూఢిల్లీ: దేశ రాజధానిలో ఇటీవల చోటుచేసుకున్న విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల చర్యలపై సుప్రీం కోర్టు అత్యంత కీలక వ్యాఖ్యలు చేసింది. నిరసన తెలుపుతున్నంత మాత్రాన విద్యార్థులపై లాఠీల ప్రయోగించడం తీవ్రమైన విషయమని పేర్కొంది. జూలై 20వ తేదీ నాటి 'సంసద్ ఛలో' ప్రదర్శన సమయంలో జంతర్ మంతర్ సమీపంలో నిరసనకారులపై పోలీసులు విచక్షణా రహితంగా విరుచుకు పడటం, టియర్ గ్యాస్ ప్రయోగించడం తీవ్ర వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. పోలీసుల అతిక్రమణలపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని, నాటి ఘటనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, బాడీ కెమెరా రికార్డింగ్‌లు సహా అన్ని రకాల ఎలక్ట్రానిక్ ఆధారాలను సురక్షితంగా భద్రపరచాలని పిటిషనర్లు కోరారు. తీవ్రంగా గాయపడిన ప్రదర్శనకారులకు తగిన నష్ట పరిహారం చెల్లించాలని కూడా విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ నిరసనల్లో తీవ్రంగా గాయపడిన పోలీసుల భద్రతను కూడా కోర్టు ప్రస్తావించింది. ప్రమాదకర పరిస్థితుల్లో విధుల్లో ఉండే పోలీసులకు తగిన భద్రతా ఉపకరణాలు ఎందుకు అందించలేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ.. పోలీసులు ఎదుర్కొన్న దాడి ఘటనలపై దాఖలైన ప్రత్యేక పిటిషన్‌ను విచారించేందుకు అంగీకరించింది. ఢిల్లీలో జరిగిన ఈ ఘటనతో నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన విద్యార్థిని పరామర్శించిన అనంతరం మాట్లాడుతూ.. పోలీసులు శాంతియుత ప్రదర్శనకారులపై పెల్లెట్ గన్లు కూడా ఉపయోగించారని ఆరోపించారు. సోమవారం కూడా ఆయన స్పందిస్తూ.. వివిధ రాష్ట్రాల్లో విద్యార్థుల గళాన్ని నొక్కేసేందుకు ప్రభుత్వం ఏకే-47 తుపాకులు, పెల్లెట్ గన్లను వాడుతోందని తీవ్ర విమర్శలు చేశారు. అయితే పెల్లెట్ గన్ల వినియోగాన్ని ఢిల్లీ పోలీసులు ఖండించారు.

## నేను స్ట్రీట్ ఫైటర్‌ను

**జైరామ్ రమేశ్‌కు ధర్మేంద్ర కౌంటర్**

న్యూఢిల్లీ: నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని (స్ట్రీట్ ఫైటర్), ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

లవ్లీ చిత్రం



# ఆగస్టు 21న 'ఇరుముడి'




మాస్ మహారాజా రవితేజ తన తదుపరి చిత్రంతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన కథానాయకుడిగా, సెన్సిబుల్ డైరెక్టర్ శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇరుముడి' సినిమా విడుదల తేదీని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రాన్ని ఆగస్ట్ 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ఓ కొత్త పోస్టర్‌తో వెల్లడించింది. ఇంకా 25 రోజుల్లో సినిమా రానుందంటూ చేసిన ఈ ప్రకటనతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. మాస్, యాక్షన్ చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవితేజ, 'నిన్ను కోరి', 'మజిలీ', 'ఖుషి' వంటి ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాలతో విజయం సాధించిన శివ నిర్వాణ కాంబినేషన్‌లో ఈ సినిమా వస్తుండటంతో దీనిపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. "అత్యంత హృద్యమైన తండ్రీకూతుళ్ల కథ" అంటూ మేకర్స్ ఈ సినిమా థీమ్‌ను పరిచయం చేశారు. రవితేజను ఇప్పటివరకు చూడని ఒక కొత్త ఎమోషనల్ పాత్రలో ఈ చిత్రం చూపించబోతోందని స్పష్టమవుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో రవితేజ, బేబీ నక్షత్ర తండ్రీకూతుళ్లుగా కనిపించడం ఆకట్టుకుంటోంది. ఈ చిత్రాన్ని ప్రఖ్యాత నిర్మాణ సంస్థలు మైత్రీ మూవీ మేకర్స్, టీ-సిరీస్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రముఖ నటుడు సాయికుమార్ కీలక పాత్రలో కనిపించనున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. విష్ణు శర్మ సినిమాటోగ్రఫీ, ప్రవీణ్ పూడి ఎడిటింగ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒక మాస్ హీరో, ఎమోషనల్ కథతో వస్తుండటంతో 'ఇరుముడి' చిత్రంపై సినీ వర్గాల్లో, ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపయింది.

# గ్రాండ్‌గా 'పొలిమేర 3' స్టార్ట్

ఓటీటీలో 'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంతమైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర-3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ మూవీ సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇవ్వగా, సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఈ ప్రకటనలో అతిపెద్ద ఆకర్షణగా యాక్షన్ కింగ్ అర్జున్ సర్జా 'పొలిమేర' వరల్డ్‌లోకి అడుగుపెట్టడం నిలిచింది. 'బ్లాస్ట్ జోన్' విజయానంతరం అర్జున్ ఈ ఫ్రాంచైజీలో కీలకమైన శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. దక్షిణ భారతదేశవ్యాప్తంగా తనదైన స్క్రీన్ ప్రెజెన్స్, శక్తివంతమైన నటనతో అభిమానులను సంపాదించుకున్న అర్జున్ చేరికతో 'పొలిమేర 3'పై అంచనాలు మరింత పెరిగాయి. కాగా.. తన ఉత్కంఠభరిత కథనం, ఊహించని మలుపులతో 'పొలిమేర'ను కల్ట్ ఫేవరెట్‌గా నిలిపిన దర్శకుడు అనిల్ విశ్వనాథ్ ఈసారి తన అత్యంత ప్రతిష్ఠాత్మక కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ మూడో భాగంలో మరింత లోతైన రహస్యాలు, భయానక అతీంద్రియ అంశాలు, సంచలనాత్మక మలుపులతో 'పొలిమేర' ప్రపంచాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లనున్నట్లు చిత్ర బృందం తెలిపింది.




# రామ్ చరణ్‌కు కోయంబత్తూరులో సర్జరీ



మెగాస్టార్ చిరంజీవి వారసుడిగా గ్లోబల్ స్టార్ గా తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సొంతం చేసుకున్నారు రామ్ చరణ్. వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈయన ఇటీవల పెద్ది సినిమాతో మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం పెద్ది విడుదల తర్వాత విరామం లభించడంతో తన చేతి మణికట్టు సర్జరీ కోసం ఆదివారం తన భార్య ఉపాసన, తల్లిదండ్రులు చిరంజీవి, సురేఖలతో కలిసి కోయంబత్తూర్ కి వెళ్ళిన విషయం తెలిసిందే. అయితే సోమవారం కోయంబత్తూర్ లోని గంగ హాస్పిటల్ లో డాక్టర్ రాజశేఖరన్ ఆధ్వర్యంలో ఆయన చేతి మణికట్టుకు సర్జరీ దిగ్విజయంగా పూర్తయింది. ఈ క్లిష్టమైన సర్జరీలో యూఎస్ మియామీకు చెందిన మణికట్టు స్పెషలిస్ట్, డాక్టర్ అలెంజాడ్రో బేడియా కూడా ఈ ఆపరేషన్ లో భాగమయ్యారని గంగా హాస్పిటల్ ఒక ప్రకటనలో తెలిపింది. రామ్ చరణ్ వేగంగా కోలుకుంటున్నారని, అయితే కొన్ని వారాల పాటూ విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాల్సి వస్తుందని వైద్య బృందం తెలిపింది. ప్రస్తుతం రామ్ చరణ్ కి సర్జరీ పూర్తయిందని తెలియడంతో మెగా అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.

# వెంకీ ఆదర్శ కుటుంబం గ్లింప్స్ రిలీజ్

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ కాంబినేషన్ లో తెరకెక్కుతున్న ఆదర్శ కుటుంబం-హౌస్ నెం. 47 సినిమా నుంచి కొత్త గ్లింప్స్ బయటకు వచ్చింది. ఈ సినిమాలో వెంకటేష్ పోషిస్తున్న చిట్టిబాబు పాత్రను ప్రేక్షకులకు పరిచయం చేస్తూ మేకర్స్ ఒక ఫన్ వీడియోను రిలీజ్ చేశారు. ఇందులో చిట్టిబాబు క్యారెక్టరైజేషన్, డైలాగ్ డెలివరీ చూస్తుంటే వెంకీ మార్క్ కామెడీ మళ్లీ స్క్రీన్ మీద చూడబోతున్నామని అర్థమవుతోంది. అప్పుడే కొత్తగా ఇల్లు చూస్తున్న జంటగా వెంకీ శ్రీనిధి కనిపించారు. కిచెన్ లో ఏసీ.. నువ్వు వంట చేసేటప్పుడు ఏసీ వేసుకుని హ్యాపీగా చేసుకోవచ్చు కదా అని హీరోయిన్ శ్రీనిధి శెట్టి సరదాగా అంటుంది. దానికి వెంకటేష్ చాలా స్టైలిష్ గా ఎస్, ఐ యామ్ ది మ్యాన్ ఆఫ్ ది హౌస్ అని చెప్పడం హైలెట్ అవుతోంది. వాషింగ్ మిషన్ కూడా ఉంది కాబట్టి నీకు పని బాగా తగ్గిపోయినట్లే అని వెంకటేష్ ఫీల్ అవుతుంటాడు. నిజానికి ఇంట్లో వంటల నుంచి బట్టలు ఉతకడం వరకు అన్నీ అతనే చేసుకుంటూ, తనను తాను బాస్ గా ఫీల్ అయ్యే క్యారెక్టర్ లో వెంకీ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ఇదే గ్లింప్స్ లో రఘు బాబుతో వెంకటేష్ చెప్పే డైలాగ్స్ సినిమాకు మరో హైలైట్. ఇంట్లో ఎవరేం పని చేసినా నచ్చదని, అందుకే అన్నీ తానే చూసుకుంటానని చిట్టిబాబు అనడం.. దానికి రఘు బాబు కౌంటర్ ఇస్తూ, ఆవిడకు ఏమీ రాదు కాబట్టి అన్నీ మీరే చేసుకుంటారని అర్థమైంది అనడం చూస్తుంటే కామెడీ యాంగిల్ ను గట్టిగానే టచ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిన్న డైలాగ్ ఎక్స్ఛేంజ్ తోనే సినిమాలో హీరో క్యారెక్టర్ ఎంత ఎంటర్టైనింగ్ గా ఉండబోతోందో త్రివిక్రమ్ హింట్ ఇచ్చారు. అలాగే నారా రోహిత్ ఆదర్శ కుటుంబం అని చెప్పడం మరో హైలెట్. అతని పాత్ర సినిమా కథలో చాలా కీలకం అని







# జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయం

ప్రముఖ సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆదివారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకోగా, ఆయనకు కనీసం ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ మేరకు వైద్యుల బృందం సోమవారం ఒక అధికారిక హెల్త్ బులెటిన్‌ను విడుదల చేసింది. ఇటీవలే బాలకృష్ణ షూటింగ్ లో గాయపడగా, ఇప్పుడు ఎన్టీఆర్ కూడా గాయపడడంతో నందమూరి అభిమానులు ఆందోళనకు గురయ్యారు. కాగా, డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్. ఎ. పూర్ణచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఎన్టీఆర్‌కు పూర్తిస్థాయిలో వైద్య పరీక్షలు నిర్వహించింది. ఆయన ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు. ఎన్టీఆర్ శరీర పరిస్థితిని, గాయం తీవ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, భుజం కండరాలు మరియు ఎముకలు పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల విశ్రాంతి తప్పనిసరని వైద్యులు వెల్లడించారు. ఫలితంగా, ఆయన దాదాపు రెండు నెలల పాటు షూటింగ్‌లకు దూరంగా ఉండి, విశ్రాంతికే పరిమితం కానున్నారు. అభిమానులు, శ్రేయోభిలాషులు ఆందోళన చెందాల్సిన పని లేదని, ఎన్టీఆర్‌కు మెరుగైన వైద్యం అందుతోందని వైద్యులు భరోసా ఇచ్చారు. మరోవైపు, గాయం విషయం తెలియగానే సోషల్ మీడియా వేదికగా అభిమానులు స్పందిస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పెద్ద ఎత్తున సందేశాలు పోస్ట్ చేస్తున్నారు.

# కహానీ3లో యామీ గౌతమ్!



బాలీవుడ్‌లో మోస్ట్ సస్పెన్స్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో ఒకటిగా గుర్తింపు పొందిన కహానీ సిరీస్‌కు సంబంధించిన తాజా డిస్కషన్స్ సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. డైరెక్టర్ సుజోయ్ ఘోష్ మరోసారి కహానీ3 ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే ఈసారి కథతో పాటు మెయిన్ లీడ్ విషయంలో కూడా కీలక మార్పులుండే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత రెండు భాగాల్లో కథకు కేంద్రబిందువుగా నిలిచిన విద్యా బాలన్ ప్లేస్ లో ఈసారి యామీ గౌతమ్‌ను తీసుకురావాలనే ఆలోచనలో డైరెక్టర్ ఉన్నారనే ప్రచారం బాలీవుడ్‌లో జోరుగా వినిపిస్తోంది. 2012లో కేవలం రూ. 8 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన కహానీ రిలీజైన తర్వాత బాక్సాఫీస్ వద్ద భారీ సక్సెస్ ను నమోదు చేసింది. రూ. 100 కోట్లకు పైగా కలెక్షన్లు సాధించడమే కాకుండా, లేడీ ఓరియెంటెడ్ కథతో కూడా కమర్షియల్ సక్సెస్ సాధించవచ్చని నిరూపించింది. విద్యా బాలన్ యాక్టింగ్ ఆ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. తర్వాత 2016లో వచ్చిన కహానీ2 విమర్శకుల ప్రశంసలు అందుకున్నప్పటికీ, మొదటి భాగం స్థాయిలో బాక్సాఫీస్ ఫలితాలను అందుకోలేకపోయింది. దాదాపు పదేళ్ల గ్యాప్ తర్వాత ఇప్పుడు మూడో భాగంపై మళ్లీ డిస్కషన్స్ మొదలయ్యాయి. తాజా సమాచారం ప్రకారం, కహానీ3 పూర్తిగా కొత్త కథాంశంతో తెరకెక్కనున్నట్లు తెలుస్తోంది. అందుకే కొత్త తరానికి కనెక్ట్ అయ్యే హీరోయిన్ ను ఎంపిక చేయాలనే ఆలోచనలో సుజోయ్ ఘోష్ ఉన్నారని బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఇటీవల వరుస సక్సెస్‌లతో మంచి ఫామ్‌లో ఉన్న యామీ గౌతమ్ ఈ క్యారెక్టర్ కు ఫస్ట్ ఛాయిస్ గా మారినట్లు ప్రచారం సాగుతోంది. ముఖ్యంగా ఆర్టికల్ 370 సినిమాలో ఆమె యాక్టింగ్ కు నేషనల్ లెవెల్ గుర్తింపు రావడం, కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాల్లో ఆమెకు పెరిగిన క్రేజ్ ఈ డెసిషన్ కు కారణమని టాక్ వినిపిస్తోంది. యాక్షన్, సస్పెన్స్, ఎమోషనల్ క్యారెక్టర్లను సమర్థంగా పోషించే సామర్థ్యం యామీకి ఉండటంతో, కహానీ లాంటి ఫ్రాంచైజీకి ఆమె సరైన ఎంపిక అవుతారని మేకర్స్ భావిస్తున్నారనే డిస్కషన్ కూడా నడుస్తోంది. మరోవైపు, గత రెండు భాగాలతో విడదీయరాని అనుబంధం కలిగిన విద్యా బాలన్‌ను పూర్తిగా పక్కన పెట్టకుండా, ఆమె కోసం స్పెషల్ క్యామియో క్యారెక్టర్ ను రూపొందించే అవకాశాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఈసారి సినిమా ప్రస్తుత మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారని కూడా ప్రచారం జరుగుతోంది.



# ప్రేయసిని పరిచయం చేసిన అర్ష్‌దీప్

టీమిండియా యువ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ తన ప్రేమ జీవితంపై కొన్ని వారాలుగా సాగుతున్న ఊహాగానాలకు తెరదించారు. నటి, మోడల్ సుప్రీన్ కౌర్‌తో తనకున్న బంధాన్ని అధికారికంగా ధ్రువీకరించాడు. ఆమెను 'నా మనిషి' అంటూ సోషల్ మీడియా ద్వారా అభిమానులకు పరిచయం చేశాడు. ఈ ప్రకటనతో వీరి ప్రేమాయణంపై వస్తున్న పుకార్లకు ముగింపు పలికారు. సుప్రీన్‌తో కలిసి దిగిన రెండు ఫొటోలను అర్ష్‌దీప్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో పంచుకున్నాడు. ఈ ఫొటోలలో ఇద్దరూ ఎంతో అన్యోన్యంగా కనిపించారు. దీనికి 'మై పర్సన్' అనే చిన్న క్యాప్షన్ జోడించారు. అర్ష్‌దీప్ బహిరంగంగా తన రిలేషన్‌షిప్‌ను అంగీకరించడం ఇదే మొదటిసారి. దీంతో అభిమానులు, సహచర క్రీడాకారులు వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సుప్రీన్ కౌర్ 1999 సెప్టెంబర్ 7న జమ్మూకశ్మీర్‌లో జన్మించారు. ఆమె ఒక నటి, మోడల్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్. పుణెలోని సింబయాసిస్ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్‌లో బీకామ్ (హానర్స్) పూర్తి చేసిన తర్వాత ఆమె మోడలింగ్, నటన రంగంలోకి అడుగుపెట్టారు. 2018లో ఫెమినా మిస్ ఇండియా పోటీలలో జమ్మూకశ్మీర్ తరపున ప్రాతినిధ్యం వహించి ఫైనలిస్ట్ అయ్యారు. ఆ తర్వాత 'జీ5'లో వచ్చిన 'నెయిల్ పాలిష్' అనే వెబ్ సిరీస్‌లో నటించారు. '83', 'సర్దార్ జీ 2' వంటి చిత్రాలలో కూడా కనిపించారు. అయితే, జుబిన్ నౌటియల్, బాద్షా, గురు రంధావా వంటి ప్రముఖ గాయకుల మ్యూజిక్ వీడియోలలో నటించడం ద్వారా ఆమెకు బాగా గుర్తింపు లభించింది. ముఖ్యంగా 'బావ్లా', 'తుఝే భూల్నా తో చాహా' వంటి పాటలు ఆమెకు మంచి పేరు తెచ్చిపెట్టాయి. సోషల్ మీడియాలో చురుకుగా ఉండే సుప్రీన్, తన వృత్తిపరమైన పనులు, ఫ్యాషన్ అప్‌డేట్స్‌ను తరచూ పంచుకుంటారు.







# వెయిట్ లిఫ్టింగ్‌లో మరో పతకం

**2026 కామన్వెల్త్ గేమ్స్‌లో భారత వెయిట్‌లిఫ్టర్ల పతకాల జోరు కొనసాగుతోంది. పురుషుల 65 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో తమిళనాడుకు చెందిన ముత్తుపాండి రాజా రజత పతకం సాధించి దేశానికి మరో గౌరవాన్ని అందించారు.**

తన కెరీర్‌లో తొలిసారిగా కామన్వెల్త్ గేమ్స్‌లో ప్రాతినిధ్యం వహించిన ఆయన, అత్యంత ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లోనూ ఆకట్టుకునే ప్రదర్శనతో రెండో స్థానంలో నిలిచి పతకాన్ని ముద్దాడారు. పోటీల ప్రారంభంలో స్నాచ్ విభాగంలో ముత్తుపాండి తన మొదటి ప్రయత్నంలో 126 కేజీల బరువును ఎత్తడంలో విఫలమైనప్పటికీ, రెండో ప్రయత్నంలో అదే బరువును సునాయాసంగా ఎత్తి పుంజుకున్నారు. మూడో ప్రయత్నంలో 129 కేజీల బరువును ఎత్తలేకపోవడంతో స్నాచ్ రౌండ్‌ను 126 కేజీల వద్ద ముగించారు. కాగా, మలేషియాకు చెందిన అజ్నిల్ బిన్ బిడిన్ ముహమ్మద్ 133 కేజీలు ఎత్తి కామన్వెల్త్ గేమ్స్ రికార్డుతో తొలి స్థానంలో నిలిచారు. ఆ తర్వాత జరిగిన క్లీన్ అండ్ జెర్క్ విభాగంలో ముత్తుపాండి మొదట 160 కేజీల బరువు ఎత్తడంలో పొరపాటు చేసినా, రెండో ప్రయత్నంలో దాన్ని విజయవంతంగా ఎత్తి కాసేపు కామన్వెల్త్ గేమ్స్ రికార్డును తన పేరిట లిఖించారు. అయితే మలేషియా లిఫ్టర్ అజ్నిల్ బిన్ బిడిన్ 162 కేజీలు ఎత్తి మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లడంతో, ముత్తుపాండి రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

# బలంగా పునరాగమనం చేస్తా: అభిషేక్ శర్మ

టీమిండియా యువ విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తీవ్ర ఫామ్ లేమితో సతమతమవుతున్నాడు. జింబాబ్వేతో ముగిసిన మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో దారుణంగా విఫలమవ్వడంపై తొలిసారిగా మౌనం వీడాడు. తన ప్రదర్శన పట్ల తీవ్ర నిరాశను వ్యక్తం చేస్తూ, బలంగా పునరాగమనం చేస్తానని ధీమా వ్యక్తం చేశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఒక భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. జింబాబ్వే పర్యటనలో టీమిండియా 3-0 తేడాతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి సత్తా చాటింది. ఈ సిరీస్‌లో 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో



అందరి దృష్టిని ఆకర్షించాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 50 (18 బంతుల్లో), 20 (9 బంతుల్లో), 81 (49 బంతుల్లో) పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. అయితే, అతని ఓపెనింగ్ భాగస్వామి అభిషేక్ శర్మ మాత్రం పూర్తిగా తేలిపోయాడు. మూడు మ్యాచ్‌ల్లో వరుసగా 1, 8, 2 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశపరిచాడు. అభిషేక్ వైఫల్యం కేవలం ఈ సిరీస్‌కే పరిమితం కాలేదు. గత ఆరు టీ20 మ్యాచ్‌లను పరిశీలిస్తే, అతని స్కోర్లు 10, 16, 3, 1, 8, 2గా ఉన్నాయి. ఒకప్పుడు బౌలర్లపై విరుచుకుపడే అభిషేక్, ప్రస్తుతం పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్నాడు. సిరీస్ ముగిసిన అనంతరం తన వైఫల్యంపై అభిషేక్ శర్మ ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించాడు. "ప్రజలు మీపై ఎంతో నమ్మకం పెట్టుకున్నప్పుడు, దాన్ని నిలబెట్టుకోలేకపోతే చాలా బాధగా ఉంటుంది. అయితే, పట్టు వదలకుండా ప్రయత్నించే వారికి ఈ ఆట ఎప్పుడూ ప్రతిఫలం ఇస్తుంది. జట్టు సిరీస్ గెలిచినందుకు సంతోషంగా ఉంది. మరింత బలంగా తిరిగొస్తాను" అని రాసుకొచ్చాడు.

# నా కెరీర్‌పై నిర్ణయం నాదే

భారత వికెట్‌కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తన క్రికెట్ ప్రయాణంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. టీ20 ప్రపంచకప్‌కు ముందే తాను ఒక నిర్ణయం తీసుకున్నానని చెప్పాడు. ఇకపై ఎవరి మాటలు పట్టించుకోకుండా, తనకు నచ్చిన విధంగానే క్రికెట్ ఆడతానని వెల్లడించాడు. పోటీ, పోలికల రేసులో భాగం కాబోనని స్పష్టం చేశాడు. తన ఆటపై నిర్ణయం తీసుకునేది తానేనని తేల్చి చెప్పాడు. జియోస్టార్ 'బిలీవ్' కార్యక్రమంలో మాట్లాడిన సంజూ.. భారత్‌లో ఎప్పుడూ పోటీ వాతావరణమే ఉంటుందని అన్నాడు. ఆ బరి నుంచి తాను బయటకు వచ్చానని చెప్పాడు. "ఎలా బ్యాటింగ్ చేయాలి, ఏం చేయాలి అని ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. సంజూ గురించి నిర్ణయం సంజూనే తీసుకుంటాడు" అని వ్యాఖ్యానించాడు. జట్టుకు అవసరమైనప్పుడు పూర్తి స్థాయిలో సహకరిస్తానని, అయితే తన శైలిని మాత్రం మార్చుకోనని స్పష్టం చేశాడు. తాను సాధించిన



విజయాలను ఎవరూ తీసివేయలేరని పేర్కొన్నాడు. టీమిండియా శిబిరంలో విరాట్ కోహ్లీతో జరిగిన సంభాషణను కూడా సంజూ గుర్తు చేసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో సుదీర్ఘంగా రాణించాలంటే జీవనశైలి, ఫిట్‌నెస్‌కు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కోహ్లీ తనకు సూచించాడని తెలిపాడు. శరీరానికి ఏ ఆహారం మంచిదో, ఎలా క్రమశిక్షణ పాటించాలో వివరించాడని చెప్పాడు. ఏడాదిన్నర పాటు ఆ విధానాన్ని అనుసరించినా, తర్వాత అదే క్రమశిక్షణ కొనసాగించలేకపోయానని నిజాయతీగా అంగీకరించాడు. టీ20 వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్‌తో సెమీఫైనల్‌కు ముందు జోఫ్రా ఆర్చర్‌పై తన గత రికార్డును చాలామంది గుర్తు చేశారని సంజూ వెల్లడించాడు. అయితే అప్పటికే తనపై తనకు పూర్తి నమ్మకం ఏర్పడిందని చెప్పాడు. గతంలో ఉన్న సంజూ, ఇప్పుడు ఉన్న సంజూ ఒకే వ్యక్తి కాదని భావించానని తెలిపాడు. న్యూజిలాండ్‌తో ఫైనల్లో జట్టుకు ప్రధానంగా పరుగులు చేయాల్సిన బాధ్యత తనపై ఉందని భావించానని అన్నాడు. మిచెల్ శాంట్నర్ బౌలింగ్‌లో వరుస డాట్ బాల్స్ ఆడినా ఆందోళన చెందలేదని, సరైన సమయం వచ్చినప్పుడు దాడి చేయాలన్న స్పష్టతే విజయానికి కారణమైందని వివరించాడు. బుమ్రా సహా ప్రతి ఆటగాడి పాత్ర భారత్ విజయానికి కారణమైందని కొనియాడాడు.



# వీవీఎస్ లక్ష్మణ్ వల్లే నేనిలా: వైభవ్

జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 3-0తో క్లీన్‌స్వీప్ చేయడంలో కీలక పాత్ర పోషించిన యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ, తన అద్భుత ప్రదర్శన వెనుక ఉన్న రహస్యాన్ని వెల్లడించాడు. తాత్కాలిక హెడ్ కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, బ్యాటింగ్ కోచ్ హృషికేశ్ కనిత్కర్ తనకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే తన విజయానికి కారణమని తెలిపాడు. ఈ సిరీస్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వైభవ్ 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును గెలుచుకున్నాడు. ఈ సిరీస్‌లో భాగంగా హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో నిన్న జరిగిన చివరి మ్యాచ్‌లో వైభవ్ 49 బంతుల్లో 81 పరుగులు చేసి జట్టు భారీ స్కోరుకు బాటలు వేశాడు. మొత్తం మూడు ఇన్నింగ్స్‌లలో కలిపి 151 పరుగులు సాధించాడు. అంతకుముందు ఇంగ్లండ్ పర్యటనలో మూడు ఇన్నింగ్స్‌లలో కేవలం 42 పరుగులే చేసి నిరాశపరిచిన వైభవ్, ఈ సిరీస్‌తో తిరిగి ఫామ్‌లోకి రావడం విశేషం. నేడు బీసీసీఐ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేసిన వీడియోలో వైభవ్ మాట్లాడాడు. "భారత సీనియర్ జట్టుకు ఆడటం, 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' గెలవడం నా కల నెరవేరినట్లే. నాకు మద్దతుగా నిలిచిన ప్రతీ ఒక్కరికీ, ముఖ్యంగా సీనియర్లకు, కోచింగ్ సిబ్బందికి ధన్యవాదాలు. సిరీస్‌కు ముందు వీవీఎస్ సర్, హృషికేశ్ సర్ నాతో ప్రత్యేకంగా మాట్లాడారు. నా మానసిక పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. నాకు పూర్తి స్వేచ్ఛనిచ్చి, ఏమీ ఆలోచించకుండా నీ ఆట నువ్వు ఆడు అని చెప్పారు" అని వైభవ్ వివరించాడు. అలాగే, జట్టులో తనకు ఎలాంటి ఒంటరి భావన కలగలేదని, ఇందుకు తన సొంత రాష్ట్రం బీహార్‌కు చెందిన వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్‌తో ఉన్న చనువే కారణమని చెప్పాడు. "సీనియర్ జట్టులో ఉన్నాననే కొత్త ఫీలింగ్ లేదు. ఇషాన్ భయ్యా కూడా మా రాష్ట్రం వాడే కావడంతో మా మధ్య మంచి వైబ్ కుదిరింది.

# వీవీఎస్ లక్ష్మణ్ ఆత్మవిశ్వాసం నింపాడు: శ్రేయస్

జింబాబ్వేపై 3-0తో టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన అనంతరం భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టు ప్రదర్శనపై ఆనందం వ్యక్తం చేశాడు. క్యాచ్‌లు జారవిడిచిన కొన్ని సందర్భాలు మినహా సిరీస్ మొత్తం తమ ఆట దాదాపు ఎలాంటి తప్పిదాలు లేకుండా సాగిందన్నాడు. జట్టు రూపొందించిన వ్యూహాలను ఆటగాళ్లంతా మైదానంలో అద్భుతంగా అమలు చేశారని, అదే విజయానికి ప్రధాన కారణమని చెప్పాడు. ఆటగాళ్లతో పాటు కోచింగ్ సిబ్బంది, సపోర్ట్ స్టాఫ్ అందరి కృషి ఈ విజయానికి కారణమైందని అయ్యర్ పేర్కొన్నాడు. తాత్కాలిక హెడ్ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించిన వీవీఎస్ లక్ష్మణ్ రోజూ ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపారని, ఆయన సూచనలు జట్టుకు ఎంతో ఉపయోగపడ్డాయని కృతజ్ఞతలు



నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# ట్విన్ సిటీ కావాలి.. ఏఐ సిటీ

ఒకప్పుడు బొగ్గు, ఉక్కు, విద్యుత్ దేశాల అభివృద్ధిని నిర్ణయించగా, నేడు డేటా, కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ మౌలిక సదుపాయాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఇంధనంగా మారాయి. ఈ మార్పులో ముందంజలో నిలిచే దేశాలు, రాష్ట్రాలే భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థను శాసించనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ, ముఖ్యంగా హైదరాబాద్, భారతదేశ ఏఐ కేంద్రంగా ఎదిగే సామర్థ్యాన్ని కలిగి ఉందా? అనే ప్రశ్న ఇప్పుడు అత్యంత ప్రాధాన్యంగా మారింది. గత రెండు దశాబ్దాల్లో హైదరాబాద్ దేశంలోనే ప్రముఖ ఐటీ నగరంగా ఎదిగింది. మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, మెటా, ఒరాకిల్, డెలాయిట్, యాక్సెంచర్ వంటి అనేక అంతర్జాతీయ సంస్థలు తమ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, పరిశోధన కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాయి. నేడు నగరం కేవలం సాఫ్ట్‌వేర్ సేవల కేంద్రం మాత్రమే కాదు; క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్, హెల్త్‌టెక్, ఫార్మా టెక్నాలజీ వంటి రంగాల్లో కూడా కీలక కేంద్రంగా ఎదిగింది. ఇప్పుడు ప్రపంచ ఐటీ రంగం సంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవల నుంచి ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థ వైపు వేగంగా మారుతోంది. కోడ్ రాయడం నుంచి వైద్య నిర్ధారణ వరకు, వ్యవసాయం నుంచి పరిశ్రమల ఆటోమేషన్ వరకు, విద్య నుంచి పాలన వరకు ప్రతి రంగంలో ఏఐ ప్రభావం కనిపిస్తోంది. ఈ మార్పును ముందుగానే గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం కృత్రిమ మేధ, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రత్యేక విధానాలు రూపొందిస్తోంది. తెలంగాణ ఇప్పటికే ఎమర్జింగ్ టెక్నాలజీస్ వింగ్, పరిశోధనా భాగస్వామ్యాల ద్వారా కృత్రిమ మేధ అభివృద్ధికి పునాది వేసింది. ఏఐ, బ్లాక్‌చెయిన్, డ్రోన్స్, రోబోటిక్స్ వంటి రంగాల్లో విధానాలు, పరిశోధన, స్టార్టప్‌లకు మద్దతు అందించే వ్యవస్థను రాష్ట్రం నిర్మించింది. ఏఐ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణకు ఉన్న అతిపెద్ద బలం మానవ వనరులు. హైదరాబాద్‌లోని ఐఐఐటీ, ఐఐటీ, ఐఎస్‌బీ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, అనేక ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతి సంవత్సరం వేలాది మంది సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్నాయి. ఈ ప్రతిభ, బలమైన ఐటీ పరిశ్రమ, స్టార్టప్ సంస్కృతి కలిసి తెలంగాణకు ప్రత్యేకమైన పోటీ సామర్థ్యాన్ని కల్పిస్తున్నాయి. అయితే అవకాశాలతో పాటు సవాళ్లు కూడా ఉన్నాయి. మొదటి సవాలు నైపుణ్యాల మార్పు. సంప్రదాయ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల స్థానంలో ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, చిప్ డిజైన్ వంటి రంగాలకు డిమాండ్ పెరుగుతోంది. వేలాది మంది ఉద్యోగులు కొత్త నైపుణ్యాలను నేర్చుకోకపోతే ఉద్యోగ అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఉంది. అందుకే విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం కలిసి భారీ స్థాయిలో అప్‌స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాలు చేపట్టాలి. రెండవ సవాలు డేటా సెంటర్లు, విద్యుత్. ఏఐ అభివృద్ధికి భారీ కంప్యూటింగ్ సామర్థ్యం అవసరం. దానికి డేటా సెంటర్లు, విశ్వసనీయ విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్, గ్రీన్ ఎనర్జీ వంటి మౌలిక సదుపాయాలు అత్యంత కీలకం. ఈ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడం తెలంగాణకు అత్యవసరం. మూడవ సవాలు సెమీకండక్టర్ తయారీ. ఏఐ సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు; దానికి అవసరమైన చిప్‌ల తయారీలో కూడా భారత్, తెలంగాణ పాత్ర పెరగాలి. డిజైన్‌తో పాటు తయారీ సామర్థ్యాన్ని పెంచగలిగితేనే సంపూర్ణ ఏఐ పర్యావరణ వ్యవస్థ ఏర్పడుతుంది. నాలుగవది బాధ్యతాయుతమైన ఏఐ. కృత్రిమ మేధ ఎంత శక్తివంతమైనదో, అంతటి ప్రమాదాలు కూడా ఉన్నాయి. డీప్‌ఫేక్‌లు, సైబర్ నేరాలు, డేటా గోప్యత, అల్గోరిథమ్ పక్షపాతం వంటి సమస్యలను దృష్టిలో ఉంచుకొని నైతిక ప్రమాణాలు, డేటా రక్షణ, సైబర్ భద్రతను బలోపేతం చేయాలి. తెలంగాణ మరో కీలక అంశంపై దృష్టి పెట్టాలి. ఇప్పటివరకు ఐటీ రంగం ప్రధానంగా హైదరాబాద్‌కే పరిమితమైంది. ఇకపై వరంగల్, ఖమ్మం, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వంటి రెండో శ్రేణి నగరాల్లో కూడా ఐటీ పార్కులు, ఏఐ ఇన్నోవేషన్ కేంద్రాలు, డిజిటల్ స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేయాలి. అప్పుడే అభివృద్ధి వికేంద్రీకరణ జరుగుతుంది. ఏఐ ప్రభావం ఐటీ రంగానికే పరిమితం కాదు. వ్యవసాయంలో పంటల అంచనా, ఆరోగ్య రంగంలో వ్యాధుల నిర్ధారణ, విద్యలో వ్యక్తిగత అభ్యాసం, ట్రాఫిక్ నిర్వహణ, పోలీసింగ్, విపత్తుల నిర్వహణ, పరిశ్రమల ఆటోమేషన్.. ప్రతి రంగంలో తెలంగాణ ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేసి దేశానికి ఆదర్శంగా నిలవవచ్చు.

# పురాణాలలో అశోకుడి పాత్ర!?

భారత చరిత్రలో అత్యంత గొప్ప చక్రవర్తులలో మౌర్య చక్రవర్తి అశోకుడు ఒకరు. క్రీ.పూ. 268 ప్రాంతంలో మౌర్య సామ్రాజ్య సింహాసనాన్ని అధిష్ఠించిన ఆయన, సుమారు క్రీ.పూ. 232 వరకు పాలించాడు. కళింగ యుద్ధం అనంతరం హింసకు బదులుగా ధర్మం, అహింస, ప్రజాహితం, మతసహనాన్ని తన పాలనా సిద్ధాంతంగా స్వీకరించి ప్రపంచ చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించాడు. అయితే ఇంతటి గొప్ప చక్రవర్తి పేరు భారతీయ పురాణాలలో ఎందుకు విస్తృతంగా కనిపించదు? అతను బౌద్ధమతాన్ని స్వీకరించడమే ఇందుకు కారణమా? లేక మరిన్ని చారిత్రక, సాహిత్య, మతపరమైన అంశాలు కూడా ఉన్నాయా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే పురాణాలు, శాసనాలు, బౌద్ధ సాహిత్యం, పురావస్తు ఆధారాలు, ఆధునిక చరిత్ర పరిశోధనలను సమగ్రంగా పరిశీలించాలి. ముందుగా ఒక అపోహను నివృత్తి చేయాలి.





డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

"అశోకుడు పురాణాలలో అసలు లేడు" అనే వాదన సరైనది కాదు. వాయు పురాణం, మత్స్య పురాణం, విష్ణు పురాణం, బ్రహ్మాండ పురాణం, భాగవత పురాణం వంటి కొన్ని గ్రంథాలలో మౌర్య రాజుల వంశావళిలో "అశోక" లేదా "అశోకవర్ధన" అనే రూపాల్లో ఆయన పేరు కనిపిస్తుంది. అయితే కళింగ యుద్ధం, ధర్మ విధానం, బౌద్ధ ప్రచారం, శాసనాల నిర్మాణం వంటి విశేషాలకు అక్కడ విస్తృత స్థానం లేదు. ఈ పరిమిత ప్రస్తావనే "పురాణాలు అశోకుడిని విస్మరించాయి" అనే అభిప్రాయానికి కారణమైంది. దీనికి ప్రధాన కారణం పురాణాల స్వభావమే. అవి ఆధునిక అర్థంలో చరిత్ర గ్రంథాలు కావు. సృష్టి, ప్రళయం, మన్వంతరాలు, దేవతల మహిమ, వంశావళులు, తీర్థక్షేత్రాలు, ధర్మశాస్త్ర భావనలు వంటి అంశాలే వాటి ప్రధాన లక్ష్యం. అందువల్ల చారిత్రకంగా గొప్పవారైన అనేక మంది రాజులు కూడా పురాణాలలో సంక్షిప్తంగానే ప్రస్తావించబడ్డారు. బింబిసారుడు, అజాతశత్రువు వంటి రాజుల వివరాలు కూడా పరిమితంగానే కనిపిస్తాయి.


మరో ముఖ్యమైన అంశం పురాణాల రచనా ప్రక్రియ. ప్రస్తుతం మనకు లభిస్తున్న పురాణాల రూపం అశోకుని కాలం తరువాత అనేక శతాబ్దాలపాటు జరిగిన సంకలనాలు, చేర్పులు, పునఃసంపాదనల ఫలితంగా ఏర్పడింది. ఈ దీర్ఘకాలంలో భారతదేశ రాజకీయ, సామాజిక, మతపరమైన పరిస్థితులు గణనీయంగా మారాయి. గుప్తుల కాలంలో బ్రాహ్మణీయ సంప్రదాయానికి మళ్లీ రాజపోషణ లభించడం పురాణాల తుది రూపంపై కొంత ప్రభావం చూపి ఉండవచ్చని కొందరు చరిత్రకారులు భావిస్తారు. అయితే అశోకుడిని ఉద్దేశపూర్వకంగా విస్మరించారని నిర్ధారించే ప్రత్యక్ష ఆధారాలు లేవు. అశోకుడు కళింగ యుద్ధం అనంతరం బౌద్ధమతాన్ని ఆదరించిన విషయం తెలిసిందే. అయితే ఆయన ఇతర మతాలను వ్యతిరేకించాడని చెప్పడానికి ఆధారాలు లేవు. తన శాసనాలలో బ్రాహ్మణులు, శ్రమణులు ఇద్దరికీ గౌరవం ఇవ్వాలని, అన్ని మతాల మధ్య పరస్పర సహనం పెంపొందించాలని ఆయన స్పష్టంగా పేర్కొన్నాడు. భారతీయ తాత్విక సంప్రదాయంలో "నాస్తిక" అనే పదం ఈనాటి "దేవుణ్ని నమ్మని వ్యక్తి" అనే అర్థంలో కాకుండా, వేదాల ప్రామాణ్యాన్ని అంగీకరించని దర్శనాలకు ఉపయోగించబడింది. కాబట్టి బౌద్ధమతాన్ని స్వీకరించినందుకే అశోకుడిని పురాణాలు విస్మరించాయని చెప్పడం చారిత్రకంగా సమర్థించబడదు.

అశోకుని జీవితాన్ని తెలుసుకోవడానికి అత్యంత విశ్వసనీయమైన ఆధారాలు ఆయన స్వంత శిలాశాసనాలు, స్తంభశాసనాలే. భారతదేశంతో పాటు నేపాల్, పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతాల్లో లభించిన శాసనాలు ఆయన పరిపాలన, ధర్మ విధానం, ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. బ్రాహ్మీ, ఖరోష్ఠి, గ్రీకు, అరమాయిక్ భాషలు, లిపుల్లో చెక్కబడిన ఈ శాసనాలు మౌర్య చరిత్రకు అమూల్యమైన ఆధారాలు. 1837లో జేమ్స్ ప్రిన్సెప్ బ్రాహ్మీ లిపిని విజయవంతంగా డీకోడ్ చేయడంతో "దేవానంపియ పియదస్సి" అనే బిరుదుతో ఉన్న శాసనాలు అశోకునివేనని తరువాతి పరిశోధనల ద్వారా నిర్ధారణ అయింది. ఇది భారతీయ చరిత్ర పరిశోధనలో ఒక కీలక మలుపుగా నిలిచింది. అశోకునికి బౌద్ధ సాహిత్యంలో మాత్రం విశేష స్థానం లభించింది. దీపవంశ, మహావంశ, అశోకావదానం, దివ్యావదానం వంటి గ్రంథాలు ఆయనను ధర్మచక్రవర్తిగా వర్ణిస్తాయి. కళింగ యుద్ధం అనంతరం సంభవించిన పరివర్తన, ధర్మ ప్రచారం, శ్రీలంకతో సహా ఇతర ప్రాంతాలకు బౌద్ధ ధర్మదూతలను పంపిన ఘటనలను విస్తృతంగా వివరిస్తాయి. అయితే ఈ గ్రంథాలు కూడా చారిత్రక సమాచారంతో పాటు మతపరమైన సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. అందువల్ల ఆధునిక చరిత్రకారులు వాటినీ శాసనాలు, పురావస్తు ఆధారాలతో పోల్చి విమర్శనాత్మకంగా పరిశీలిస్తారు. నేడు అశోకుని వారసత్వం భారత జాతీయ గుర్తింపులో భాగమైంది. సారనాథ్‌లోని సింహస్తంభం భారత జాతీయ చిహ్నంగా, ధర్మచక్రం జాతీయ పతాకంలో స్థానం పొందాయి. ఇవి అశోకుడి చారిత్రక, నైతిక వారసత్వానికి భారతదేశం ఇచ్చిన గౌరవానికి ప్రతీకలు.

అందువల్ల "అశోకుడు బౌద్ధమతాన్ని స్వీకరించినందుకే పురాణాలలో స్థానం పొందలేదు" అనే వాదనకు ప్రత్యక్ష చారిత్రక ఆధారాలు లేవు. అలాగే "పురాణాలు ఆయనను పూర్తిగా విస్మరించాయి" అనడమూ సరైంది కాదు. పురాణాల రచనా లక్ష్యం, వాటి సంకలన కాలం, సాహిత్య స్వభావం, మతపరమైన పరిణామాలు వంటి అనేక అంశాలు కలిసి ఈ పరిస్థితిని రూపొందించాయి. అశోకుని చరిత్రను అర్థం చేసుకోవాలంటే పురాణాలతో పాటు శాసనాలు, బౌద్ధ సాహిత్యం, పురావస్తు ఆధారాలు, ఆధునిక చరిత్ర పరిశోధనలను సమన్వయంగా పరిశీలించాలి. అదే చారిత్రక పరిశోధనలో శాస్త్రీయమైన, సమతుల్యమైన దృక్పథం.

ఒకప్పుడు వేసవి వచ్చిందంటే తెలంగాణలోని అనేక గ్రామాల్లో తాగునీటి కోసం కిలోమీటర్ల దూరం నడిచే మహిళల దృశ్యాలు సాధారణంగా కనిపించేవి. బోర్లు ఎండిపోవడం, ట్యాంకర్ల కోసం గంటల తరబడి ఎదురుచూడడం, ఫ్లోరైడ్ సమస్యతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడటం వంటి పరిస్థితులు రాష్ట్ర చరిత్రలో భాగమయ్యాయి. అలాంటి పరిస్థితులను మార్చాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ తెలంగాణలో ప్రతి ఇంటికీ రక్షిత తాగునీటిని అందించే ఒక మహత్తర కార్యక్రమంగా గుర్తింపు పొందింది. దీనిలక్ష్యం స్పష్టమైనది. రాష్ట్రంలోని ప్రతి గ్రామం, ప్రతి పట్టణం, ప్రతి ఇంటికి పైప్‌లైన్ ద్వారా శుద్ధి చేసిన తాగునీటిని అందించడం. గోదావరి, కృష్ణా నదుల నీటిని శుద్ధి చేసి విస్తృత పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా సరఫరా చేసే ఈ పథకం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య గణనీయంగా తగ్గింది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా ప్రజలకు ఉపశమనం లభించింది.

# భగీరథ-2 రావాల్సిందే!




మహిళలు, బాలికలు నీటి కోసం గంటల తరబడి కష్టపడే పరిస్థితి చాలావరకు తగ్గింది. ఈ కోణంలో చూస్తే మిషన్ భగీరథ తెలంగాణ సామాజికాభివృద్ధిలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని చెప్పవచ్చు. అయితే ఒక పథకం విజయం కేవలం నీటిని సరఫరా చేయడంలోనే కాదు; ఆ నీటి వనరులను భవిష్యత్తు తరాలకు కూడా భద్రపరచడంలో ఉంటుంది. ఇక్కడే కొత్త సవాళ్లు కనిపిస్తున్నాయి.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు నీటి చక్రాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో భారతదేశంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు పలుమార్లు హెచ్చరిస్తున్నారు. వర్షాలు తగ్గితే జలాశయాల్లోకి వచ్చే నీటి ప్రవాహం తగ్గుతుంది. ఫలితంగా తాగునీరు, సాగునీరు, పరిశ్రమలకు నీటి లభ్యతపై ఒత్తిడి పెరుగుతుంది. హైదరాబాద్ వంటి మహానగరం ఈ సవాలును మరింత తీవ్రంగా ఎదుర్కొంటోంది. నగర జనాభా వేగంగా పెరుగుతోంది. కొత్త నివాస సముదాయాలు, ఐటీ పార్కులు, పరిశ్రమలు, వాణిజ్య కేంద్రాలు విస్తరిస్తున్నాయి. జనాభా పెరిగే కొద్దీ తాగునీటి డిమాండ్ కూడా భారీగా పెరుగుతోంది. నగర అవసరాల కోసం కృష్ణా, గోదావరి నదులపై ఆధారపడాల్సి వస్తోంది. వర్షపాతం తగ్గిన సంవత్సరాల్లో ఈ ఆధారపడటం మరింత సవాలుగా మారే అవకాశం ఉంది. మరోవైపు భూగర్భ జలాల పరిస్థితి కూడా ఆందోళన కలిగిస్తోంది. నగరంలో వేల సంఖ్యలో బోర్‌వెల్లు ఉన్నాయి. వర్షపు నీరు భూమిలోకి ఇంకే అవకాశాలు తగ్గిపోవడం, కాంక్రీట్ నిర్మాణాలు పెరగడం వల్ల భూగర్భ జలమట్టం క్రమంగా పడిపోతోంది. మిషన్ భగీరథ తాగునీటిని అందించినా, భూగర్భ జలాలను పునరుద్ధరించే చర్యలు సమాంతరంగా లేకపోతే భవిష్యత్తులో నీటి సంక్షోభం మళ్లీ తలెత్తే అవకాశం ఉంది.

అందుకే మిషన్ భగీరథ రెండో దశ గురించి ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. మొదటి దశలో నీటిని ఇంటింటికీ చేర్చితే, రెండో దశలో ప్రతి నీటి చుక్కను సంరక్షించడం ప్రధాన లక్ష్యంగా ఉండాలి. మొదటిగా వర్షపు నీటి సంరక్షణను ప్రతి ఇంటికి, ప్రతి అపార్ట్‌మెంట్‌కు, ప్రతి పరిశ్రమకు తప్పనిసరి చేయాలి. కేవలం నిబంధనగా కాకుండా సమర్థవంతంగా అమలు చేయాలి. నగరాల్లో పడే వర్షపు నీటిలో పెద్ద భాగం నేరుగా డ్రైనేజీల్లో కలుస్తోంది. అది భూమిలోకి ఇంకేలా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయాలి. రెండవది, చెరువుల సంరక్షణ అత్యవసరం. తెలంగాణ చెరువుల సంస్కృతికి ప్రసిద్ధి. చెరువులు కేవలం సాగునీటి వనరులు మాత్రమే కాదు; భూగర్భ జలాలను నింపే సహజ నిల్వ కేంద్రాలు కూడా. చెరువుల ఆక్రమణలు, కాలుష్యాన్ని అరికట్టకుండా దీర్ఘకాలిక నీటి భద్రత సాధ్యం కాదు. మూడవది, మురుగునీటి శుద్ధి మరియు పునర్వినియోగంపై మరింత దృష్టి పెట్టాలి. తాగునీటిని తాగడానికి మాత్రమే ఉపయోగించి, ఉద్యానవనాలు, పరిశ్రమలు, నిర్మాణ పనులకు శుద్ధి చేసిన మురుగునీటిని వినియోగించే విధానాన్ని విస్తరించాలి. ప్రపంచంలోని అనేక నగరాలు ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. నాలుగవది, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచాలి. ఇంట్లో లీకేజీలు, పాత పైప్‌లైన్లలో నీటి నష్టం, అవసరానికి మించి వినియోగం వంటి అంశాలను తగ్గించాలి. స్మార్ట్ మీటరింగ్, నీటి ఆడిట్, డిజిటల్ మానిటరింగ్ వంటి సాంకేతికతలను విస్తృతంగా వినియోగించాలి. ఐదవది, ప్రజల్లో నీటి సంరక్షణపై అవగాహన పెంచాలి. ప్రభుత్వం ఎంత పెద్ద ప్రాజెక్టులు నిర్మించినా, ప్రజలు నీటిని వృథా చేస్తే ప్రయోజనం ఉండదు. ప్రతి కుటుంబం నీటిని ఆదా చేయడం ఒక సామాజిక బాధ్యతగా భావించాలి. అదేవిధంగా నగరాభివృద్ధి ప్రణాళికలో నీటి వనరులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కొత్త కాలనీలు, పారిశ్రామిక పార్కులు, భారీ భవనాలకు అనుమతులు ఇచ్చేటప్పుడు నీటి లభ్యత, వర్షపు నీటి సంరక్షణ, మురుగునీటి శుద్ధి వంటి అంశాలను తప్పనిసరి ప్రమాణాలుగా పరిగణించాలి. మిషన్ భగీరథను కేవలం ఒక తాగునీటి పథకంగా కాకుండా తెలంగాణ జల భద్రత మిషన్గా విస్తరించే ఆలోచన కూడా అవసరం. తాగునీటి సరఫరాతో పాటు భూగర్భ జలాల సంరక్షణ, చెరువుల పునరుద్ధరణ, నీటి పునర్వినియోగం, వర్షపు నీటి నిల్వ, వాతావరణ మార్పులకు అనుగుణమైన నీటి నిర్వహణ.. ఇవన్నీ ఒకే సమగ్ర విధానంలో ఉండాలి. ప్రపంచం ఇప్పుడు నీటి కోసం పోటీ పడే దశలోకి అడుగుపెడుతోంది. భవిష్యత్తులో నీరు కేవలం సహజ వనరు కాదు; ఆర్థికాభివృద్ధిని, సామాజిక స్థిరత్వాన్ని, ప్రజల జీవన ప్రమాణాలను నిర్ణయించే వ్యూహాత్మక సంపదగా మారబోతోంది. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ఇప్పుడే ముందుచూపుతో చర్యలు తీసుకుంటేనే రేపటి సంక్షోభాన్ని నివారించగలదు.



నవీన్ పోగుల
బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు


## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811


This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.